బృహత్తర బాధ్యత

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ముగ్గురికి.. బాపట్ల జిల్లా పరిధిలోని ఒకరికి చంద్రబాబు క్యాబినెట్‌లో చోటు దక్కగా వారందరికీ కీలక శాఖలను కేటాయించారు. మంత్రివర్గ కూర్పులో మంగళగిరి, రేపల్లె, తెనాలి, అద్దంకి ఎమ్మెల్యేలకు పెద్ద పీట వేశారు. అదే సమయంలో శాఖల కేటాయింపులో కూడా అదే ప్రాధాన్యత లభించింది. లోకేశ్ మినహా నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లకు తొలిసారిగా మంత్రి పదవులు దక్కాయి. అయినా వారికి సీఎం చంద్రబాబు కీలక శాఖలను అప్పగించి బృహత్తర బాధ్యత పెట్టారు. తమ నేతలకు మంత్రి పదవి దక్కడంతో పాటు కీలకమైన శాఖలను చంద్రబాబు కట్టబెట్టడంతో కూటమి పార్టీ శ్రేణులతో పాటు జిల్లావాసులు ఆనందంతో సంబరాలు చేసుకుంటున్నారు. ఐదేళ్లలో విధ్వంసం తప్ప అభివృద్ధి మాటెరుగని ఆయా రంగాల్లో ఇక మీదట పురోగతి కనబడుతుందనే ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పతనానికి నాంది పలికి కూటమి విజయంలో కీలకపాత్ర పోషించిన నిర్ణయాలకు సంబంధించిన శాఖలు జిల్లా మంత్రులకు దక్కాయి. ఇక మీదట వీరు తీసుకునే ప్రతి నిర్ణయంపై ప్రజలు ఆసక్తి కనబరిచే అవకాశం ఉంది.

- జిల్లా మంత్రులకు కీలక శాఖలు
- ప్రాధాన్య శాఖలతో సర్వత్రా హర్షం
- జిల్లా వాసుల ఆశలన్నీ అమాత్యులపైనే
- నారా లోకేశ్‌కు మానవ వనరులతో పాటు ఐటీ శాఖ
- అనగాని సత్యప్రసాద్‌ను వరించిన రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు
- గొట్టిపాటి రవికి విద్యుత్..
- మనోహర్‌కు పౌరసరఫరాలు

గుంటూరు, తెనాలి, బాపట్ల (ఆంధ్రజ్యోతి), మంగళగిరి, జూన్ 14: రాష్ట్ర మంత్రి వర్గంలో మంత్రులకు శాఖల కేటాయింపు విషయంలో ఉత్కంఠతకు తెరపడింది. శుక్రవారం మంత్రుల శాఖలను వెల్లడించటంతో కూటమి శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. చంద్రబాబు కేబినెట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లాకు కీలక మంత్రిత్వ శాఖలు దక్కాయి. మొత్తం నలుగురికి మంత్రి వర్గంలో చోటు లభించిన విషయం తెలిసిందే. నలుగురిలో ముగ్గురు తొలిసారిగా మంత్రులయ్యారు. అయినా వారికి చంద్రబాబు కీలకశాఖలు అప్పగించారు. రాజధాని అమరావతిలో భాగమైన గుంటూరు, బాపట్ల లోక్‌సభ పరిధిలో మొత్తం నలుగురికి మంత్రులయ్యే అవకాశం దక్కింది. కీలకమైన మంత్రిత్వ శాఖలు దక్కడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లా అభివృద్ధి అమాత్యులపై పడింది. తమ శాఖల ద్వారా తమతమ నియోజకవర్గాలతో పాటు జిల్లా అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేసే అవకాశం వారికి దక్కింది. మంత్రులకు కీలక శాఖలు దక్కడంతో కూటమి పార్టీల శ్రేణులతో పాటు జిల్లావాసుల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తమ నేతల మీద నమ్మకంతో కీలక శాఖలు కట్టబెట్టిన చంద్రబాబు నిర్ణయాన్ని ప్రజలు అభినందిస్తున్నారు. మంగళగిరి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నారా లోకేశ్‌కు మాత్రమే మంత్రిగా చేసిన అనుభవం ఉంది. తెనాలి నుంచి ఎన్నికైన నాదెండ్ల మనోహర్, రేపల్లె నుంచి ఎన్నికైన అనగాని సత్యప్రసాద్, అద్దంకి నుంచి ఎన్నికైన గొట్టిపాటి రవికుమార్‌లకు మాత్రం తొలిసారిగా మంత్రి పదవి దక్కింది. అయితే వీరికి గతానుభవం లేకపోయినా చంద్రబాబు కీలక శాఖల బాధ్యతలు అప్పగించడం విశేషం. లోకేశ్ గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన ఐటీ శాఖను మళ్లీ అప్పగించి అదనంగా మానవ వనరుల అభివృద్ధి శాఖను కేటాయించారు. ఆయనకు గతంలో ఐటీ శాఖ నిర్వహించిన అనుభవం ఉంది. ఈ పరిస్థితుల్లో రాజధాని ప్రాంతంలో ఐటీ అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి చేసే అవకాశం ఆయనకు దక్కింది. ఎన్నికల ప్రచారంలో యువతకు ఉపాధిపై లోకేశ్ హామీలు ఇచ్చి ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల ద్వారా హామీలను నెరవేర్చే అవకాశం లోకేశ్‌కు వచ్చింది. ఇక తీర ప్రాంతం నుంచి ఎన్నికై చంద్రబాబు క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న అనగానికి రెవెన్యూ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కేటాయించారు. ఇక వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ శాఖను అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు అప్పగించారు. గత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిన విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టే పెద్ద బాధ్యత రవిపై ఉంది. స్పీకర్‌గా చేసిన వారు మళ్లీ ఎన్నికల్లో గెలవడం అరుదనే వాదనలున్న తరుణంలో అది నిజంకాదంటూ నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించడమే కాకుండా చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. పైగా తొలిసారి మంత్రి పదవి పొందినా ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల వ్యవహారాల శాఖను కేటాయించారు. గతంలో మనోహర్ ఉన్నత పదవులు అలంకరించినా, మంత్రిగా పదవిని పొందడం మాత్రం ఇదే తొలిసారి.

గతంలోనూ..

ఐదేళ్ల వైసీపీ పాలనలో వివిధ శాఖలు అస్తవ్యస్తంగా మారాయన్న ఆరోపణల నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా, బాపట్ల జిల్లాకు చెందిన మంత్రులకు కీలక శాఖల బాధ్యతలను చంద్రబాబు అప్పగించారు. అయితే గతంలోనూ జిల్లాకు చెందిన వారు ఎన్నో కీలకశాఖలను నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి పదవిని గత టీడీపీ హయాంలో దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు, ప్రత్తిపాటి పుల్లారావు, కాంగ్రెస్ పాలనలో కాసు కృష్ణారెడ్డి బాధ్యతలు నిర్వహించారు. తిరిగి ఇప్పుడు ఈ శాఖ నాదెండ్ల మనోహర్‌కి కేటాయించారు. ప్రస్తుతం అనగానికి దక్కిన రెవెన్యూశాఖను గతంలో ఎన్‌టీఆర్ హయాంలో పొన్నూరు నుంచి గెలుపొందిన ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి కొంతకాలం నిర్వహించారు. గతంలో టీడీపీ హయాం లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే అవకాశం దక్కింది.

నాడు పౌరసరఫరాల్లో అక్రమాలు వెలికి తీసి.. నేడు మంత్రిగా

వైసీపీ హయాంలో పౌర సరఫరాల శాఖలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి.. భారీ నిధుల గోల్‌మాల్.. మళ్లింపు చేశారు.. చిక్కీలు, కందిపప్పు, రేషన్ బియ్యం దారిమళ్లించారు.. అంటూ పౌరసరఫరాల శాఖలో జరిగిన పలు కుంభకోణాలను జనసేన పీఏసీ చైర్మన్‌గా నాదెండ్ల మనోహర్ వెలుగులోకి తెచ్చారు. ఆయన బయటపెట్టిన ఏ కుంభకోణాన్నయినా పూర్తి ఆధారాలతోనే గతంలో వెల్లడించారు. దీంతో ఆయా శాఖల మంత్రులు కూడా వాటిపై స్పందించడానికి భయపడిన పరిస్థితి. కానీ మనోహర్ వాటిని వదలకుండా చివరి వరకు అంటే ఎన్నికలకు ముందు వరకు వెంటపడుతూనే వచ్చారు. ఈ నేపథ్యంలో తెనాలి నుంచి కూటమి తరపున గెలిచిన నాదెండ్లకు ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల వ్యవహారాల శాఖను మనోహర్ దక్కించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే ఇప్పుడు అంతటి కీలకమైన శాఖ ఆయన చేతికి రావడంతో ఆ కుంభకోణాల గుట్టు విప్పుతారని, వారి పనిపడతారనే ఆశాభావం జనం నుంచి వ్యక్తమవుతోంది.



లోకేశ్‌కు మళ్లీ ఐటీ..



మంగళగిరి నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన నారా లోకేశ్‌కు కూటమి ప్రభుత్వంలో కీలకమైన మంత్రిత్వ శాఖలు దక్కాయి. లోకేశ్ 2016-19లో శాసన మండలి తరఫున ఐటీ, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు గతంలో నిర్వహించిన ఐటీ శాఖతోపాటు మానవ వనరుల అభివృద్ధి శాఖ అదనంగా దక్కింది. గతంలో ఉమ్మడి రాష్ట్ర రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను చంద్రబాబు ఐటీ హబ్‌గా తీర్చిదిద్దారు. ఆయన తనయుడైన లోకేశ్‌కు ఐటీ శాఖపై పట్టు ఉంది. ఈ పరిస్థితుల్లో అమరావతి ఐటీ రంగంలో హైదరాబాద్‌తో పోటీ పడేలా లోకేశ్ పనితీరు ఉండే అవకాశం ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో లోకేశ్ ఐటీ మంత్రిగా మంగళగిరి, గన్నవరం ప్రాంతాల్లో పలు ఐటీ సంస్థలను ఏర్పాటు చేయించి వేలాది మంది యువతకు ఉపాధి కల్పించారు. ఇప్పుడు మారిన పరిస్థితుల్లో లోకేశ్ మరింత కసిగా అమరావతికి పెద్దఎత్తున ఐటీ పరిశ్రమలను తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆయన కార్యాచరణను ప్రారంభించారని సమాచారం. గత వైసీపీ ప్రభుత్వం పగబట్టినట్టు పనిచేయడంతో అమరావతి ప్రాంతం అన్ని విధాలుగా వెనుకబడింది. అభివృద్ధిలో వెనుకంజ వేసిన అమరావతి ప్రాంతాన్ని మళ్లీ ముందుకు పరుగులెత్తించే విధంగా గొప్ప పనితీరును కనబరచాలని లోకేశ్ పట్టుదలగా ఉన్నారు. ఐటీ శాఖ దక్కడంతో మంగళగిరి, అమరావతి ప్రాంతాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు లోకేశ్‌కు ఒకింత వెసులుబాటు కలిగినట్టయింది. లోకేశ్ మంగళగిరి నుంచి మంత్రివర్గంలో కొనసాగనుండడంతో నియోజకవర్గ ప్రజలు ఆయనపై ఎన్నో ఆశలు... మరెన్నో అంచనాలతో ఉన్నారు. 2029 నాటికి మంగళగిరి, అమరావతి ప్రాంతాలు లోకేశ్ సారధ్యంలో దేశానికి ఓ దిక్సూచిలా మారతాయని ఈ ప్రాంత ప్రజలు విశ్వసిస్తున్నారు.

అనగానికి.. రెవెన్యూ చక్కదిద్దే అవకాశం



భూ వివాదాలు.. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోక పలువురు బాధితులు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. రెవన్యూ వ్యవస్థలో పాతుకుపోయిన నిర్లక్ష్యం, అవినీతి తాండవంతో భూయజమానులు, రైతులు అల్లాడిపోతున్నారు. రెవెన్యూ బాధితులు తహసీల్దార్ల కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా వారి చెప్పులు అరగడం తప్పితే ప్రయోజనం ఉండడం లేదు. అంతే కాకుండా వైసీపీ ప్రభుత్వం దిగిపోయే ఏడాదిన్నరకు ముందు అసైన్డ్ చట్టసవరణతో పాటు లంక భూములకు యాజమాన్య హక్కులనేవి వైసీపీ నేతలకే వరంగా మారాయని విమర్శలను అప్పట్లో టీడీపీ నేతలే చేశారు. ఇంతటి ప్రాధాన్య శాఖ రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌ను వరించింది. ఒకవిధంగా రెవెన్యూను చక్కదిద్ది తన పనితీరుతో ప్రభుత్వానికి కూడా మంచి పేరు తేచ్చే అవకాశం చంద్రబాబు అనగాని భుజస్కంధాలపై పెట్టారు. వైసీపీ నేతలు ఐదేళ్లలో ఇష్టారాజ్యంగా భూములను చెరబట్టారు. వారికి కొమ్ముకాసే రెవెన్యూ సిబ్బంది అండతో వేల ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు కైంకర్యం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై చంద్రబాబు సంతకం చేసినప్పటికీ ప్రజల్లో దాని తాలూకా భయాందోళనలు వెంటాడుతూనే ఉన్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు ఐదేళ్లలో జరిగిన భూ మేతల పట్ల సమగ్ర విచారణ జరిపించాలనే డిమాండ్లు ఇప్పటికే వెల్లువెత్తుతున్నాయి.

గొట్టిపాటి చేతిలో విద్యుత్ ప్రక్షాళన



చంద్రబాబు అంటేనే నాణ్యమైన విద్యుత్.. కోతలు లేని సరఫరా. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ శాఖ అంటే వినియోగదారులను పిండుకునేందుకు ఉపయోగించుకుంది. కరెంట్ కోతలు నిత్యకృత్యంగా మారాయి. ఒక విధంగా వైసీపీ దారుణ పరాజయం వెనక మధ్యతరగతి నడ్డి విరిచిన కరెంటు బిల్లులు కూడా ప్రధాన కారణంగా ఉన్నాయి. రకరకాల సర్‌చార్జీల పేరుతో బిల్లులు చూస్తేనే షాక్ కొట్టేంతగా వైసీపీ పాలన సాగించింది. ఎడాపెడా చార్జీల భారం మోపడమే కాకుండా కార్యాలయాల ముందు వినియోగదారులు ధర్నాకు దిగిన ఉదంతాలను కూడా గతంలో చూశాం. వైసీపీ ఘోర ఓటమి వెనక ఇవన్నీ కూడా కీలకంగా పనిచేశాయి. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం పై విద్యుత్ శాఖను పటిష్ట పరిచి చార్జీలు తగ్గించడమే కాకుండా నాణ్య మైన కోతలు లేని సరఫరాను ప్రజలు ఆశిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంతటి కీలకమైన శాఖ బాధ్యత చంద్రబాబు అనగానిపై పెట్టారు. విద్యుత్ శాఖలో ఐదేళ్లుగా పేరుకుపోయిన నిర్లక్ష్యాన్ని ప్రక్షాళన చేయడంతో పాటు షాక్ కొట్టే కరెంటు చార్జీల నుంచి ప్రజలకు ఊరట కలిగించాల్సిన గురుతర బాధ్యత గొట్టిపాటిపై ఉంది.

నాడు ఉరి నేడు సరి?

117 జీవో BANNED

- ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవమే
- జీవో 117 రద్దు హామీపై ఉపాధ్యాయుల హర్షం
- వైసీపీ ప్రభుత్వ నిర్ణయంతో 500పైగా పాఠశాలల మూత
- జీవో 117పై ఆందోళనలను పట్టించుకోని నాటి పాలకులు



గుంటూరు(విద్య), జూన్ 14: వైసీపీ హయాంలో సీఎం జగన్ అనాలోచిత నిర్ణయం ఊరి బడికి ఉరిగా మారింది. 117 జీవో.. 500పైగా ప్రాథమిక పాఠశాలల ఉసురుతీసింది. ఈ జీవో వల్ల ప్రాథమిక విద్యా వ్యవస్థకు నష్టమని అటు ఉపాధ్యాయులు, ఇటు మేధావులు ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం ఆలకించలేదు. ప్రాథమిక తరగతుల విద్యార్థులు బడికి దూరమవుతారని తల్లిదండ్రుల గోడును పట్టించుకోలేదు. విద్యా వ్యవస్థను తీర్చి దిద్దాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవ హరించింది. అయితే ఎన్నికల ప్రచారంలో 117 జీవో రద్దుకు ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. ఈ క్రమంలో వైసీపీ ఓటమి పాలవడం.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో జీవో 117 రద్దుతో పాటు విద్యా వ్యవస్థలోని లోటుపాట్లను సరి చేస్తారని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవం రానుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. మౌలికవసతులతో పాటు విద్యార్థులు అక్కడ పూర్తిస్థాయిలో చదువుకునేలా ఏర్పాట్లు చేసినప్పుడే ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం ఏర్పడుతుందని ఉపాధ్యాయ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుంటూరు)

విద్యార్థులు దూరం.. పోస్టులకు కోత

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ 117 జీవోను తెచ్చారు. దీనివల్ల ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 30 వేల మంది విద్యార్థులు ప్రైవేటు బాట పట్టారు. మరో 3 వేల మంది విద్యార్థులు డ్రాపవుట్లుగా మిగిలారు. 2500పైగా ఉపాధ్యాయ పోస్టులకు కోత పడింది. లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులు లేక మూత వేయాల్సిన దుస్థితి నెలకొంది. జీవో 117తో ఊరి బడికి ఉరి వేయవద్దని ఉపాధ్యాయ సంఘాలు నెత్తినోరు బాదుకున్నా జగన్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 3500పైగా పైగా ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల్లో విద్యాశాఖ లెక్కల ప్రకారమే 4.5 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉపా ధ్యాయ పోస్టులు తగ్గించడానికే వైసీపీ ప్రభుత్వం జీవో 117 తీసుకువచ్చింది. ఈ జీవోతో ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల్ని ఉన్నత పాఠశాల ల్లోకి విలీనం చేశారు. ఉన్నత పాఠశాలలు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఉండటంతో తల్లిదండ్రులు పిల్లల్ని అక్కడికి పంపేందుకు వెనుకంజ వేశారు. ఇంటి సమీపంలోని బడి మూతతో ఈ దుస్థితి నెలకొందని వారు వాపోయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. సాధారణంగా 3, 4, 5 తరగతులు చదివే విద్యార్థులు పదేళ్లలోపే ఉంటారు. వీరంతా సుదూరంగా ఉండే ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో పిల్లల్ని తల్లిదండ్రులు తమకు అందుబాటులో ఉండే ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడం ప్రారంభించారు. 1, 2 తరగతులు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల్ని చేర్పించే వారు లేక అవి క్రమంగా నిర్వీర్యం అయ్యేస్థాయికి వచ్చాయి. మరోవు ఉన్నత పాఠశాలల్లో కూడా 3, 4, 5 తరగతుల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు ముం దుకు రాలేదు. దీంతో ఒక్క పల్నాడు జిల్లాలోనే దాదాపు 200పైగా పాఠశాలలు ఈ ఏడాది విద్యార్థులు లేక మూత పడే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ సంఘాలు నాయకులు వెల్లడిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారాల్లో జీవో 117 రద్దుకు సంబంధించి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హామీ ఇచ్చారు. వైసీపీ అధికారం కోల్పోయి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం గతంలో వారిచ్చినట్లుగా జీవో 117 రద్దు అవుతుందని.. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం వస్తోందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

నీటి పథకం నిధులు గోల్‌మాల్



పాత పైపులకు వేసిన రంగు

- పాత పైపులు వినియోగం
- కొత్త పైపులు నిర్మించినట్టుగా బిల్లులు
- నీటిశుద్ధి ప్లాంట్ పనుల్లో అవకతవకలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మునిసిపాల్టీ నీటిపథకం పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయి. పెద్ద ఎత్తున నిధులు గోల్‌మాల్ చేస్తున్నారు. పాత పైపులకు రంగులు వేసి కొత్తవిగా సృష్టిస్తున్నారు. పనులపై అధికారుల పర్యవేక్షణ పూర్తి కొరవడింది. కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కయ్యారన్న విమర్శలున్నాయి.

శాంతినగర్ వద్ద ఉన్న నీటి శుద్ధి ప్లాంట్‌లలో రూ.1.40 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. ప్లాంట్‌లకు నీటిని సరఫరా చేసే పైపులను పూర్తిగా మార్చే విధంగా వ్యయ అంచనాలు రూపొందించారు. అంతర్గత రోడ్డు, కాలువల నిర్మాణం పనులు చేపట్టారు. మూడు ప్యాకెజ్‌లలో పనులు నిర్వహిస్తున్నారు. రూ.40 లక్షల వ్యయంతో రెండు ప్యాకేజ్‌లు, రూ.60 లక్షల వ్యయంతో ఒక ప్యాకేజ్‌గా పనులను విభజించి టెండర్లు నిర్వహించారు. అయితే పనులు పూర్తిగా నాసిరకంగా జరుగుతున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అక్రమార్కుల పంచన చేరారన్న ఆరోపణలున్నాయి. నీటి సరఫరాకు సంబంధించి పాడైన పైపుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే పాత పైపులకే గ్రైండింగ్ చేసి రంగు వేసి కొత్తవి గా చిత్రీకరించారు. ఈ పనులకు అధికారులు ఆమోదం తెలిపారన్న విమర్శలు వ్యక్తమవు తున్నాయి. ఈ అక్రమాలు ప్రభుత్వం మారడంతో వెలుగులోకి వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం హ యాంలో ఈ అక్రమాలను బయటకు పొక్కకుం డా అధికారులు జాగ్రత్త పడ్డారని కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మునిసిపాల్టీలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు నీటిశుద్ధి ప్లాంట్‌లో చేప ట్టిన పనులు పరిశీలించి అక్రమాలపై స్పందించి వారి చిత్తశుద్ధిని నిరుపించుకోవాల్సి ఉంది. నీటి శుద్ధి ప్లాంట్‌లో చేపట్టిన పనులను పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని మునిసిపల్ ఇంజనీర్ కనకారావు తెలిపారు.



వినియోగించిన పాత పైపులు

నిర్లక్ష్యం .. నిరుపయోగం

- సత్తెనపల్లి వైద్యశాలలో మూలనపడిన వెంటిలేటర్లు

సత్తెనపల్లి, జూన్ 14: అత్యవసర చికిత్సకు ఉపయోగపడే వెంటిలేటర్లు నిరుపయోగంగా మారాయి. రూ.లక్షల విలువైన ఈ పరికరాల వినియోగంపై సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారన్న విమర్శలున్నాయి. కరోనా సమయంలో వైద్యశాలకు 10 వెంటిలేటర్లను ప్రభుత్వం కేటాయించింది. రోగుల ఆయువుని నిలబెట్టే వెంటిలేటర్లు ప్రస్తుతం మరమ్మతులకు గురై మూలన పడి ఉన్నాయి. వెంటిలేటర్లను వినియోగంలోకి తెస్తే అత్యవసర రోగులకు చికిత్స చేసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే ఇక్కడ వాటిని మూలనపడేసి.. అత్యవసర కేసులను గుంటూరు వైద్యశాలకు పంపిస్తున్నారు. ఆస్పత్రిలో నిరుపయోగంగా ఉన్న వైద్య పరికరాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



ఏరియా వైద్యశాలలో నిరుపయోగంగా వెంటి లేటర్లు


సిబ్బంది లేకే..

ఆస్పత్రిలో 10 వెంటిలేటర్లు ఉన్నాయి. వీటి ఏర్పాటుకు ఒక ప్రత్యేక గది లేదు. వీటిని వినియోగంలోకి తేవాలంటే మత్తు డాక్టర్, ఐసీయూ టెక్నీషియన్స్ అవసరం. సంబంధిత డాక్టర్‌ను, సిబ్బందిని అధికారులు నియమిస్తే వెంటిలేటర్లను వినియోగంలోకి తేవచ్చు.

\- లక్ష్మణరావు, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల

పవర్‌ఫుల్ పాత్రలో...

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'విశ్వంభర'. త్రిషకృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా, విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ శుక్రవారం సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఇందులో ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నారని మేకర్స్ తెలిపారు. సంక్రాంతి కానుకగా ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. ఈ చిత్రానికి డీఓపీ: చోటా. కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.





పరమేశ్వరుని ఆజ్ఞతోనే కన్నప్ప తీశాం

మంచు మోహన్‌బాబు

"కన్నప్ప కథ అన్ని తరాలను ఆకట్టుకుంటుంది. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే 'కన్నప్ప' చిత్రం తీశాం. ప్రభాస్ కోసం రాసుకున్న కథను కృష్ణంరాజు గారు మేం అడగ్గానే ఇచ్చి, ప్రోత్సహించారు. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఇది కేవలం భక్తి చిత్రమే కాదు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలూ ఉన్నాయి' అని మంచు మోహన్‌బాబు అన్నారు. విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. శుక్రవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ '2014లో 'కన్నప్ప' సినిమా తీయాలని నిశ్చయించుకున్నాను. అంతా సిద్ధం చేసి పెట్టుకున్నాను. ఇప్పుడు సినిమా తీసి మీ ముందుకు తీసుకొస్తున్నాం. కన్నప్పది కల్పిత గాథ కాదు. రెండో శతాబ్దంలో జరిగిన ఘటన. శంకరాచార్యుల వారు కూడా కన్నప్ప గురించి చెప్పారు. 14వ శతాబ్దంలో ధూర్జటి కన్నప్ప గురించి రాశారు. 18వ శతాబ్దంలో కన్నప్ప గురించి బ్రిటీషర్లు రాసిన పుస్తకం బికనీర్ యూనివర్సిటీలో ఉంది. దాని ఆధారంగానే జాగ్రత్తగా సినిమా తీశాం. ఇకపై ప్రతి సోమవారం కన్నప్ప చిత్రం నుంచి అప్‌డేట్ వస్తుంది. బడ్జెట్ గురించి ఆలోచించలేదు. చరిత్రలో నిలిచిపోయే సినిమా తీస్తున్నామని ధైర్యంగా ముందుకెళ్లాం' అని చెప్పారు.

నిమ్స్‌లో పీహెచ్‌డీ

దిక్సూచి DIKSUCHI



హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 26 సీట్లు ఉన్నాయి. నిమ్స్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇది మూడేళ్ల వ్యవధిగల ఫుల్ టైం ప్రోగ్రామ్. గరిష్ఠంగా అయిదేళ్లలో పూర్తిచేయవచ్చు. డాక్టోరల్ కమిటీ అనుమతి మేరకు మరో మూడేళ్లు పొడిగించే వీలుంది. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు; పబ్లిక్ సెక్టార్ సంస్థలు/యూనివర్సిటీలు/ఇతర ఇన్‌స్టిట్యూషన్‌లకు చెందిన ఉద్యోగులు అడ్మిషన్ నాటికి సంబంధిత సంస్థ నుంచి 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాలి. ప్రోగ్రామ్ సమయంలో ఇతర డిగ్రీలు/డిప్లొమాలు చేసేందుకు అనుమతించరు.

విభాగాలు-సీట్లు: బయోకెమిస్ట్రీ 3, క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరపిటిక్స్ 1, ఎమర్జెన్సీ మెడిసిన్ 1, మెడికల్ జెనెటిక్స్ 4, మెడికల్ అంకాలజీ 2, మైక్రోబయాలజీ 5, న్యూరాలజీ 1, నెఫ్రాలజీ 6, పాథాలజీ 1, ఫిజియోథెరపీ 2.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(లైఫ్ సైన్సెస్/అలైడ్ మెడికల్ సైన్సెస్) ఉత్తీర్ణులు; కనీసం 55 శాతం మార్కులతో ఎంబీబీఎస్/ బీడీఎస్ ఉత్తీర్ణతతోపాటు ఏడాది రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీతోపాటు రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; ఎన్ఎంసీ/డీఎన్‌బీ నుంచి ఎండీ/ఎంఎస్ ఉత్తీర్ణులు; ఎంటెక్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/డేటా సైన్స్/మెషిన్ లెర్నింగ్/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ జేఆర్ఎఫ్, ఐసీఎంఆర్-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, డీబీటీ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, ఇన్‌స్పయిర్ ఫెలోషిప్ అర్హతల్లో ఒకటి ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: పరీక్ష 50 మార్కులకు ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ మెథడాలజీ, బయో స్టాటిస్టిక్స్, ఎథిక్స్ అంశాల నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఇది అన్ని విభాగాల వారికి కామన్‌గా ఉంటుంది. రెండో పార్ట్‌లో అభ్యర్థులు హ్యూమన్ అనాటమీ, హ్యూమన్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, సెల్ బయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మకాలజీ విభాగాల నుంచి మూడింటిని ఎంచుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థి ఎంచుకొన్న విభాగాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. వీరిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. తరవాత మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2000
- **మెడికల్ ఎగ్జామినేషన్ ఫీజు:** రూ.4050
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **నిమ్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 13
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

జైలు నుంచి హేమ విడుదల



బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో అరెస్టయి పరప్పన అగ్రహార జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సినీ నటి హేమ శుక్రవారం విడుదలయ్యారు. బుధవారం ఎన్‌డీపీఎస్ ప్రత్యేక కోర్టు హేమకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గురువారం బెయిల్‌లో సూచించిన నిబంధనలకు అనుగుణంగా పూర్తి ప్రక్రియ సాగింది. శుక్రవారం అన్ని షరతులకు లోబడి పత్రాలు సమర్పించడంతో హేమను విడుదల చేశారు.

ఊరి గొడవల్లో కుర్రోళ్ల మజా



సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. నిహారికా కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. యదువంశీ దర్శకుడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం హీరో నితిన్ ఈ చిత్రం టీజర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఊరి గొడవల్లో తలదూర్చిన యువబృందం ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది అనే నేపథ్యంలో స్నేహం, ప్రేమ, భావోద్వేగాల కలయికగా సాగిన టీజర్ ఆసక్తికరంగా అనిపించింది. సాయికుమార్ కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్. సినిమాటోగ్రఫీ: రాజు ఎదురోలు

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో డిప్లొమా

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ- 'డిప్లొమా ఇన్ ఫిషరీస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ పొందవచ్చు. ప్రభుత్వ కళాశాలల్లో 55 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 440 సీట్లు ఉన్నాయి. 75 శాతం సీట్లను కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రత్యేకించారు. 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ఎస్ఎస్‌సీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ నుంచి 2024 మార్చిలో పదోతరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్, ఏపీఓఎస్ఎస్, టీఓఎస్ఎస్ అభ్యర్థులు; కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/ మధ్యలో ఆపేసినవారు కూడా అర్హులే. ఇంటర్/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తుకు అనర్హులు. 2024 ఆగస్టు 31 నాటికి అభ్యర్థుల వయసు 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 6
- **వెబ్‌సైట్:** apfu.ap.gov.in

ఎయిమ్స్ రిషికేశ్‌లో ఎమ్మెస్సీ

రిషికేశ్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- ఎమ్మెస్సీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- మెడికల్ బయోకెమిస్ట్రీ 7, మెడికల్ ఫిజియాలజీ 2, మెడికల్ ఫార్మకాలజీ 2, పెర్ఫ్యూజన్ టెక్నాలజీ 2 సీట్లు ఉన్నాయి.
- మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు బీఎస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. మిగిలిన మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లకు ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఫార్మసీ/నాలుగున్నరేళ్ల బీపీటీ/మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి.

రిటెన్ టెస్ట్: పరీక్ష సమయం మూడు గంటలు. అభ్యర్థి ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 200. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం పర్సెంటైల్ రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,000; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులకు ఫీజు లేదు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **వెబ్‌సైట్:** www.aiimsrishikesh.edu.in

నా కోరిక తీరింది



చైతన్యరావు, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ రొమాంటిక్ కామెడీకి బాల శేఖరుని దర్శకత్వం వహించగా, కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో చైతన్య రావు మాట్లాడుతూ "ప్రతి నటుడికీ అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న క్యారెక్టర్ చేయాలనే కోరిక ఉంటుంది. ఈ సినిమా ద్వారా నాకు ఆ కోరిక తీరింది" అని అన్నారు. "అన్ని వర్గాల ప్రేక్షకులకి సినిమా కనెక్ట్ అవుతుంది" అని దర్శకుడు బాలశేఖరుని చెప్పారు. "థియేటర్స్‌లో ప్రేక్షకులని ఆకట్టుకునేది కంటెంట్ మాత్రమే. ఆ మంచి కంటెంట్ ఇందులో ఉంది" అని హెబ్బా పటేల్ అన్నారు.

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటొమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ(డీఓఏఏటీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో కంప్యూటర్ నాలెడ్జ్, మేథమెటిక్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలకు సంబంధించి మొత్తం 30 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 30. నెగెటివ్ మార్కులు లేవు. మోడల్ ప్రశ్న పత్రాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

నీలిట్‌లో ఎంటెక్

గోరఖ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)-ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎలక్ట్రానిక్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ డిజైన్ స్పెషలైజేషన్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 18 సీట్లు ఉన్నాయి. ఇన్‌స్టిట్యూట్ లెవెల్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు. గేట్ అభ్యర్థులకు ఏఐసీటీఈ నుంచి పీజీ స్కాలర్‌షిప్ లభిస్తుంది. నాన్ గేట్ అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ స్కీం కింద సంస్థ స్టయిపెండ్ చెల్లిస్తుంది.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీ) కోడ్ పేపర్‌కు నిర్దేశించిన గేట్ సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ఈ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 19
- **కౌన్సెలింగ్:** జూన్ 20
- **వెబ్‌సైట్:** nielit.gov.in

జాబ్ కార్నర్

ఎస్‌బీఐలో ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్.. రెగ్యులర్ ప్రాతిపదికన ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్(ఎంఎంజీఎస్-2)- మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 **(150)** భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏదైనా విభాగంలో డిగ్రీ, ఐఐబీఎఫ్ ఫారెక్స్ సర్టిఫికేట్‌తో పాటు ట్రేడ్ ఫైనాన్స్ ప్రాసెసింగ్‌లో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

పోస్టింగ్: హైదరాబాద్, కోల్‌కతా
దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 27
వెబ్‌సైట్: https://sbi.co.in/

ఎన్ఎఫ్‌సీలో మెడికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్.. అడ్‌హక్ ప్రాతిపదికన 3 జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
వయోపరిమితి: 50 ఏళ్లు మించకూడదు
ఇంటర్వ్యూ తేదీ: జూన్ 24
వేదిక: ఎన్ఎఫ్‌సీ గెస్ట్‌హౌస్(గురుకుల్), న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, ఈసీఐఎల్ ఫ్యాక్టరీ దగ్గర, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://nfc.gov.in/








తుళ్లూరు చర్చిలో ప్రార్థనలలో పాల్గొన్న మహిళలు, రైతులు

రాజధాని రైతుల ప్రత్యేక ప్రార్థనలు

తుళ్లూరు, జూన్ 14: చర్చిలో, మసీదులో రాజధాని అమరావతి రైతులు, మహిళలు, రైతు కూలీలు ప్రార్థనలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం వెలగపూడి సచివాలయానికి వచ్చే క్రమంలో సీడ్ రోడ్డు మీద పూల మాన్పు పరచి అభిమానం చాటుకున్నారు. మండల కేంద్రం తుళ్లూరు ఆర్సీఎం చర్చిలో, మసీదులలో రైతు జేఏసీ నేతలు కాటా అప్పారావు, కొల్లి నరేంద్ర, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ కిరణ్, మహిళా జేఏసీ నేత కామినేని గోవిందమ్మ, ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం, క్రిస్టియన్ సోదరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


తుళ్లూరు మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న రైతులు ముస్లిం సోదరులు

జడ్పీలో బాహాబాహీ!

● జూనియర్‌పై రెచ్చిపోయిన సీనియర్ ఆడిటర్

గుంటూరు సిటీ, జూన్ 14: గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయం శుక్రవారం ఆడిట్ ఉద్యోగుల రణరంగానికి వేదికైంది. జిల్లా ఆడిట్ కార్యాలయంలో సీనియర్ ఆడిటరుగా పనిచేస్తున్న ఒక ఉద్యోగి తన సహోద్యోగిపై బూతులతో రెచ్చిపోయాడు. ఈ ఘటన జిల్లా అధికారి సమక్షంలోనే జరిగిం ది. జడ్పీ భవనంలో ఆడిట్ సిబ్బంది ఇటీవల ఖాళీ చేసిన పై అంతస్తులోని పాత కార్యాలయంలో జిల్లా ఆడిట్ అధికారి సమావేశం ఏర్పాటు చేశారు. సీనియర్, జూనియర్ ఆడిటర్లు, సిబ్బంది హాజరయ్యారు. ఆడిట్ సిబ్బందిలో అనైక్యత అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్టు తెలిసింది. సమావేశంలో జూనియర్ ఆడిటర్ మాట్లాడుతుండగా సీనియర్ ఆడిటర్ ఆగ్రహంతో అతడిని పలుమార్లు దూషించినట్లు తెలుస్తోంది. ఆనక అతడిని పక్కకు తోసివేసి కుర్చీతో అతడిని కొట్టబోయినట్లు సమాచారం. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు నగరంపాలెం పోలీసు స్టేషన్‌కు బాధితుడు బయల్దేరగా సిబ్బంది అతడిని ఆపి సర్దిచెప్పారు. తమ భవనంలో ఆడిట్ సిబ్బంది కొట్లాటకు దిగడంపై జడ్పీ సిబ్బంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అవ్వా.. తాతలకు.. పండగే!

ఇంటి పెద్ద కొడుకుగా అవ్వాతాతలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారు. తాను అధికారం చేపట్టిన వెంటనే పింఛను మొత్తాన్ని రూ.3 నుంచి 4 వేలకు పెంచుతానని చెప్పినట్లుగానే చంద్రబాబు, తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆ హామీని నెరవేర్చేందుకు పూనుకున్నారు. యువత కోసం మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన ఆయన పింఛను దస్త్రాలపై మూడో సంతకం చేశారు. అవ్వాతాతలకు పెద్దకొడుకులా, ఒంటరి, వితంతు మహిళలకు అన్నలా తోడు నిలుస్తూ పింఛను మొత్తాన్ని 4వేలకు పెంచుతూ సంతకం చేశారు. దివ్యాంగులకు పింఛను మొత్తాన్ని రెట్టింపు చేసి వారికి భుజం కాశారు. సంతకం చేయడమే తడవుగా శుక్రవారం అధికారులకు జీవో చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మించి పింఛను వరాన్ని ఇచ్చారు.

● ఇక నుంచి రూ.4 వేల పింఛను.. జూలై నెలలో రూ.7వేలు
● దివ్యాంగులకు రూ.3 నుంచి 6 వేలకు పెంపు
● పూర్తి వైకల్యం, పక్షవాతంతో మంచం పట్టినవారికి రూ.15వేలు
● తీవ్ర అనారోగ్య బాధితులకు రూ. 5 నుంచి 10 వేలకు పెంపు
● నాడు రూ. 200 నుంచి 2 వేలకు పెంచిన చంద్రబాబు
● నేడు ఇచ్చిన హామీ మేరకు రూ.3 నుంచి 4 వేలకు పెంపు
● మూడు జిల్లాల్లో 7,73,482 మందికి చేకూరనున్న లబ్ధి

గుంటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో సామాజిక భద్రతా పింఛన్లు రూ.3 వేలు నుంచి 4 వేలకు పెంచుతారన్న హామీ మాత్రమే ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా దివ్యాంగులు, అనారోగ్య బాధితుల పింఛను అంతకు మించిన స్థాయిలో పెంచుతూ కూటమి ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ట్రాన్స్‌జెండర్లు, హెచ్‌ఐవీ బాధితులు, డప్పు కళాకారులు, ఇతర కళాకారుల పింఛను రూ.3 నుంచి 4 వేలకు పెంచారు. పాక్షిక దివ్యాంగులు, కుష్టు వ్యాధి బాధితులకు పింఛను మొత్తాన్ని రెట్టింపు చేశారు. వారికి రూ.3 నుంచి 6 వేలకు పింఛను పెంచారు. పూర్తిగా వైకల్యంతో వున్న దివ్యాంగులు, పక్షవాతంతో మంచం పట్టినవారు, ప్రమాదం కారణంగా మంచం పట్టినవారి పట్ల చంద్రబాబు చూపిన ఔదార్యం ఔరా అనిపించింది. వారికి పింఛను ఒక్కసారిగా మూడు రెట్లు పెంచారు. ఇప్పటివరకూ రూ.5 వేలు పింఛను తీసుకునే వారికి ఇక నుంచి రూ.15వేలు పెంచి ఇవ్వనున్నారు. దీర్ఘకాలిక అనారోగ్య బాధితులు, గుండె, కాలేయం, మూత్రపిండాల మార్పిడి బాధితులు, సాధారణ డయాలసిస్ బాధితులకు ఇప్పటి వరకూ ఇస్తున్న రూ.5 వేల పింఛనును ఇక నుంచి రూ.10 వేలకు పెంచారు. దీంతో వారికి ఇతరులపై ఆధారపడి, భారం కాకుండా ఉండేలా చంద్రబాబు భరోసా ఇచ్చారు.

మూడు జిల్లాల్లో 7.73 లక్షల మందికి లబ్ధి

తాజా గణాంకాల ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని 7లక్షల 73వేల 482 మంది పింఛనుదారులకు పెరిగిన పింఛన్లతో లబ్ధి చేకూరనుంది. గుంటూరు జిల్లాలో 2,59,315 మంది, పల్నాడు జిల్లాలో 2,80,568 మంది, బాపట్ల జిల్లాలో 2,33,599 మంది పింఛనుదారులు వున్నారు. వీరందరికీ పెంచిన పింఛన్లు జూలై నెలలో అందనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పెంచిన పింఛన్లు అందించనున్నారు. జూలై నెలలో ఇచ్చే పింఛనుతోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి వెయ్యి రూపాయల చొప్పున పెరిగిన రూ.3 వేలు కలిపి జూలై నెలలో 7 వేలు అందించనున్నారు.

పెంచిన పింఛన్ల వివరాలు

కేటగిరి	ప్రస్తుతం	పెంచిన తర్వాత
వయోవృద్ధులు	3000	4000
వితంతువులు	3000	4000
చేనేత కార్మికులు	3000	4000
కల్లుగీత కార్మికులు	3000	4000
మత్స్యకారులు	3000	4000
ఒంటరి మహిళలు	3000	4000
చర్మకారులు	3000	4000
హెచ్‌ఐవీ బాధితులు	3000	4000
ట్రాన్స్‌జెండర్లు	3000	4000
డప్పు కళాకారులు	3000	4000
ఇతర కళాకారులు	3000	4000
దివ్యాంగులు	3000	4000
వయోవృద్ధులు	3000	6000
కుష్టు బాధితులు	3000	6000
పూర్తి వైకల్యం	5000	15000
పక్షవాత బాధితులు	5000	15000 (కదలలేనివారు)
మంచం పట్టినవారు	5000	15000
సాధారణ డయాలసిస్	5000	10000
కిడ్నీ, గుండె, లివర్‌మార్పిడి	5000	10000

200 నుంచి 4 వేలకు...

2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అయిన వెంటనే రూ.200గా వున్న సామాజిక భద్రతా పింఛనును ఒక్కసారిగా ఐదురెట్లు పెంచి రూ.వెయ్యి రూపాయలు చేశారు. ఆ తరువాత మరో మూడేళ్లకు పింఛనును రెట్టింపు చేస్తూ రూ.2 వేలకు పెంచారు. అంటే చంద్రబాబు 2014లో పదవి చేపట్టేనాటికి రూ.200గా వున్న పింఛను పదిరెట్లు పెరిగి రూ.2వేలు అయింది. కాగా 2019 ఎన్నికల సందర్భంగా తాను పింఛను రూ.3 వేలు చేస్తానని హామీ ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ తాను అధికారం చేపట్టిన వెంటనే మాట తప్పారు. నాలుక మడతేసి తాను దశలవారీగా పెంచుతానని అవ్వాతాతలను వంచించారు. రెండేళ్లకొకసారి రూ.250 చొప్పున పెంచి వారిని వంచించారు. సరిగ్గా ఎన్నికలకు మూడు నెలల ముందు రూ.3వేలు ఇచ్చి హామీని నిలబెట్టుకున్నట్లు మాజీ ముఖ్యమంత్రి జగన్, వైసీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు. ఐతే పింఛనుదారులు ఎవరూ వారి మాటలు నమ్మలేదు. చంద్రబాబుకే మళ్లీ పట్టం కట్టారు. అన్నమాట ప్రకారం ఒక్కసారిగా రూ.వెయ్యి రూపాయలు పెంచి పింఛనును రూ.3వేల నుంచి 4 వేలు చేసి పింఛనుదారులకు చంద్రబాబు మేలు చేశారు.



బాలకార్మిక వ్యతిరేక మాసం వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి పార్థసారథి

బాల కార్మిక నిరోధం ప్రతి ఒక్కరి బాధ్యత

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు(లీగల్), జూన్ 14: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించటం, బాల కార్మిక నిరోధంను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీ ఎస్‌బీవీ పార్థసారధి అన్నారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఏ.అనిత, చైల్డ్ రైట్స్ అడ్వొకేసి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పార్థసారధి మాట్లాడుతూ తల్లి తండ్రులకు తమ పిల్లలందరిని పాఠశాలకు పంపించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనిత మాట్లాడుతూ విద్యావంతులైన బాలల వలన మెరుగైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఏ గాయత్రి, జిల్లా బాలల రక్షణాధికారి సీహెచ్ విజయ్‌కుమార్ చైల్డ్ రైట్స్ అడ్వొకేసి ఫౌండేషన్ జిల్లా కోర్డినేటర్ కె సమీర్, బచపన్ బచావో అందోళన్ రాష్ట్ర కోఆర్డినేటర్ జి తిరుపతిరావు ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి పార్థసారధి 'బాలకార్మిక వ్యతిరేక మాసం వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. సీనియర్ పానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాస్ బాలకార్మికుల చట్టాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, పలు విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, జూన్14: ప్రయాణికుల అవసరాలకు తగిన విధంగా బాపట్ల రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తామని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. ఆటోమెటిక్ టిక్కెట్టు వెండింగ్ మిషన్ పనితీరును పరిశీలించి అక్కడ ఉన్న ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అమృత్ రైల్వే ప్రాజెక్ట్ పనులు వల్ల లైట్లు వెలగక ప్లాట్ ఫారాల మీద వసతులు లేక ప్రయాణకులు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించామన్నారు. బాపట్ల రైల్వేస్టేషన్‌లో ఫాస్ట్‌ట్రైన్స్ ఆగటం లేదని ప్రయాణికులు తన దృష్టికి తెచ్చారన్నారు. ఈ విషయమై రైల్వేమంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. గుంటూరు, విజయవాడ వెళ్ళే ఉద్యోగుల కోసం బాపట్ల నుంచి ఇంటర్‌సిటీ ట్రైన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తనతో ఫోన్‌లో మాట్లాడవచ్చునని లేదా వాట్సప్‌లో మెసేజ్ ద్వారా తెలియజేయవచ్చు అన్నారు.



బాపట్ల రైల్వేస్టేషన్‌లో ఆటోమెటిక్ టిక్కెట్టు వెండింగ్ మిషన్ పనితీరును పరిశీలిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

పరిషత్ నిర్వాహకుడు నాగభైరు కన్నుమూత

చిలకలూరిపేట, జూన్ 14: చిలకలూరిపేట మండలంలోని నాగభైరువారిపాలెంలో కాకతీయ కళాపరిషత్ అధ్యక్షుడు నాగభైరు సుబ్బారావు(86) శుక్రవారం మృతిచెందారు. ఆయనకు నలుగురు కుమార్తెలు. ఆయన జాతీయస్థాయిలో ఆ గ్రామంలో 18 సంవత్సరాల పాటు నాటకపోటీలను నిర్వహించి పరిషత్‌ల నిర్వహణలో మైలురాయిని సృష్టించారు. అంత్యక్రియలు శనివారం ఉదయం ఆ గ్రామంలో జరుగుతాయి. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు జక్కంపూడి సీతారామారావు, కళాకారులు మల్లాది శివన్నారాయణ, కొల్లా రాధాకృష్ణ, నాయుడు గోపి, కృష్ణేశ్వరరావు, డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, ముద్దన రాఘవయ్య చౌదరి తదితరులు సంతాపం ప్రకటించారు.


నాగభైరు సుబ్బారావు(ఫైల్)

ఆచార్య ఎన్జీ రంగా సాహిత్య పురస్కారానికి
దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), జూన్14: ఆచార్య ఎన్జీరంగా ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి ఎన్జీ రంగా సాహిత్య పురస్కారాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది రచయిత్రులకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబరు 7న గుంటూరులో జరిగే ఆచార్య ఎన్జీ రంగా జయంతి వేడుకల్లో విజేతలకు నగదు బహుమతి ప్రదానం, సన్మానం జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు (98494 97739), డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు(93930 15584), డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు (98483 51517) నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు పురస్కారం

గుంటూరు(విద్య), జూన్ 14: ఆర్యవైశ్య ప్రొఫెషనల్స్ అండ్ అఫీషియల్స్ (అవోపా) బ్యాంకు మెన్ చాప్టర్ హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఎంసెట్, నీట్, జేఈఈ అడ్వాన్స్‌లో వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను స్వర్ణ పతకాలతో సత్కరించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వీఈ రమణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు సెల్ నం 9441928528లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్

పెదకాకాని, జూన్ 14: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెల్ఫ్ సపోర్టు కేటగిరీలో భర్తీ చేయనున్న డ్యూయల్ డిగ్రీ ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ శనివారం నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12:30 వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఏఎన్‌యూలోని స్టాటిస్టిక్స్ విభాగం, విజయవాడలోని నలంద డిగ్రీ కళాశాల, విశాఖపట్నంలోని ఎంఎస్‌ఆర్‌ఎస్ సిద్ధార్థ కళాశాలలో ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు సకాలంలో దరఖాస్తు చేసుకోలేని వారు నేరుగా తమ ఆధార్ కార్డు, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సర్టిఫికెట్‌ను ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు తీసుకువెళ్లి సంబంధిత అధికారి అనుమతి తీసుకొని పరీక్షకు హాజరు కావచ్చునని డాక్టర్ అనిత సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

ఎంత త్వరగా పద్ధతులు మార్చుకుంటే అంత మేలు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 14: ఐదేళ్ల అరాచక వైసీపీ పాలనకు అలవాటు పడిన యంత్రాంగం అంతా ఎంత త్వరగా వారి వారి పద్ధతులు మార్చుకుంటే అంత మేలు అని మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హితవు పలికారు. సమస్యలతో తమ వద్దకు వచ్చే ప్రజలందరికీ ప్రతి ఒక్క అధికారి, ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది జవాబుదారి తనంతో వ్యవహరించాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అఖిల భారత సర్వీసుల అధికారులకు ఏ విషయాల్లో ఐతే తీరు మారాలని దిశ నిర్దేశం చేశారో అవే అందరికీ వర్తిస్తాయని ప్రత్తిపాటి అన్నారు. ఆయనకు శుక్రవారం వివిధ శాఖల అధికారులు కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాలు కప్పి సన్మానాలు చేశారు. కలసిన వారిలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆర్టీవో అధికారులు, నాదెండ్ల మండల విద్యాశాఖ అధికారులు, విద్యుత్ శాఖ ఏడీఈ, పట్టణ సచివాలయాల సిబ్బంది, మహిళా పోలీసులు, డీఆర్‌వో వినాయకం, తహసీల్దార్ జ్వాల నరసింహం తదితరులు ఉన్నారు.


ప్రత్తిపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ శాఖల అధికారులు

చంద్రబాబుకు అనగాని కృతజ్ఞతలు



రేపల్లె, జూన్ 14: రెవెన్యూశాఖ కేటాయించటం పట్ల తాడేపల్లిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి మంత్రి అనగాని సత్యప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతను విస్మరించకుండా విధులు నిర్వహిస్తానని, రాష్ట్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అనగాని తెలిపారు. మంత్రి పదవికి సహకరించిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి, సహచర మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రహ్మారెడ్డిని కలిసిన జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు

గుంటూరు సిటీ, జూన్ 14: మాచర్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన జూలకంటి బ్రహ్మారెడ్డిని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా దంపతులు శుక్రవారం కలిశారు. గుంటూరులోని జూలకంటి నివాసంలో ఆయనను కలిసిన చైర్‌పర్సన్ దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మాచర్లలో అనేక ఒత్తిడులు ఉన్నా ధైర్యంగా పోరాడి గెలుపు సాధించారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ జూలకంటిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.


మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు


విత్తనాల గోడౌన్లలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి

రూ.15 లక్షల విలువచేసే..
పత్తి విత్తనాల అమ్మకాలు నిలిపివేత

గుంటూరు సిటీ, జూన్ 14: గుంటూరు నగరం ఏటుకూరు రోడ్డులోని షాపులపై విత్తన తనిఖీబృందం శుక్రవారం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో క్రిస్టల్ కంపెనీకి చెందిన స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా లేనందున రూ.15లక్షలు విలువైన పత్తి విత్తనాల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. తొలుత కంపెనీ గోడౌన్లలో తనిఖీలు నిర్వహించిన అధికారులు 1830 పత్తి విత్తనాల ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. సదరు విత్తనాలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్ పరిశీలించగా అందులో తగిన వివరాలు లేనట్టుగా గమనించారు. అదేవిధంగా సిద్దార్థ సీడ్స్, ఆదిత్య సీడ్స్, కావేరి సీడ్స్‌కు చెందిన గోడౌన్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పురుగుమందుల పరీక్షా కేంద్రం ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి, అర్బన్ ఏవోలు భవనం అంజిరెడ్డి, బి.కిషోర్ పాల్గొన్నారు.

32 కిలోల గంజాయి పట్టివేత

● ముగ్గురు నిందితుల అరెస్టు

మాచర్లటౌన్, జూన్ 14: మండలంలోని విజయపురిసౌత్ అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో శుక్రవారం గంజాయి పట్టుబడింది. రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ కె.సురేష్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి మాచర్ల వైపు వస్తున్న కేఏ03 ఎండి 2710 నంబరు గల కారును చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఆపి తనిఖీచేయగా సుమారు 32 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కారులో ఉన్న మడకా రాంబాబు, బుంగర రాజేశ్వరి, చోలంగి చంద్రశేఖర్‌లను అదుపులోకి తీసుకున్నారు. రాంబాబు, రాజేశ్వరిది అల్లూరి సీతారామరాజు జిల్లా కాగా, చంద్రశేఖర్ రాజమండ్రికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. వీరంతా ఓ ముఠా సభ్యులు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నారు. 32 కేజీల గంజాయి సుమారు రూ.3.20లక్షల దాకా ఉంటుందని సీఐ చెప్పారు. ఆంధ్ర-కర్ణాటక బోర్డర్‌లో రాజారెడ్డి, సురేందర్‌రెడ్డిలకు గంజాయిని అందించడానికి తీసుకొస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. త్వరలోనే రాజారెడ్డి, సు రేందర్‌రెడ్డిలను కూడా అదుపులోకి తీసుకోనున్నట్లు సీఐ తెలిపారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీలో విజయపురి సౌత్ ఏఎస్ఐ సోమ్లానాయక్, సాంబనాయక్, విజయ్, సీతయ్య పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ సురేష్

31,130 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 29,324 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 31,130 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,588 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తెల్లకాయలు	5000	10500
334	8000	18000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	11000	16000	334	11000	14500
273	10000	16000	నెంబరు. 5	13000	14000
341	8500	17200	273	14500	15000
4884	--	--	341	8000	17000
సూపర్ 10	--	--	4884	14500	17000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	19700	తేజ	9000	20000
బ్యాడిగి	9000	17000	బ్యాడిగి	9000	16500
దేవనూరుడీలక్స్	8500	14500	తెల్లకాయలు	5000	11500



మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డితో కారంపూడి నేతలు

మరువలేని మెజార్టీ ఇచ్చారు

● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

కారంపూడి, జూన్ 14: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన తనకు మాచర్ల నియోజకవర్గ ప్రజలు మరువలేని మెజార్టీని అందించారని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం బ్రహ్మారెడ్డిని కారంపూడి నేతలు కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గం పదిహేనేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నరసరావుపేట ఎంపీ లావుశ్రీకృష్ణదేవరాయలు, మంత్రుల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలకు స్వేచ్ఛ, వాక్స్వాతంత్ర్యం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. దోపిడి రాజ్యం కూలిపోయిందని, బానిస బతుకులు పోయాయని, దౌర్జన్యాలు, దోపిడీల రాజ్యంకు ముగింపు పలుకుతున్నామన్నారు. వ్యాపారస్థులు స్వేచ్ఛగా వ్యాపారాలు కొనసాగించాలన్నారు. బ్రహ్మారెడ్డిని కలిసిన వారిలో కాపు సంఘ నేత మిరియాల వెంకటేశ్వర్లు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు నాగవరపు రాముడు, ఆంజనేయులు, రమేష్ తదితరులు ఉన్నారు.

నేడు విజయోత్సవ ర్యాలీ.. మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలుపొంది మొట్టమొదటిసారిగా నియోజకవర్గంలో అడుగిడుతున్న సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి ఘనంగా స్వాగతం పలుకుతూ నిర్వహించే విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని టీడీపీ నేతలు కోరారు. మండలంలోని పేటసన్నిగండ్లలో గల ఆంజనేయస్వామి ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభం కానున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు.

దుర్గి: ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మొట్టమొదటిసారిగా మాచర్ల నియోజకవర్గంలోకి వస్తున్న సందర్భంగా భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు కూటమి నేతలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి సంబరాలకు సిద్ధమయ్యారు.

కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

● అధికారుల వేధింపులకు తాళలేక అఘాయిత్యం ?

సత్రశాల విద్యుత్‌ప్రాజెక్టు (రెంటచింతల) జూన్ 14: సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్‌ప్రాజెక్టులోని కాంట్రాక్టు ఉద్యోగి ఇస్లావత్ సేవానాయక్ అధికారుల వేధింపులు తాళలేక గురువారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బంధువులు, స్థానికుల సమాచారం మేరకు.. జెట్టిపాలెం గ్రామానికి చెందిన సేవానాయక్ ఇంటర్ వరకు చదివి విద్యుత్ ప్రాజెక్టులో 7 సంవత్సరాల నుంచి సివిల్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కిడ్నీలో రాళ్లు తీయించుకుని శస్త్ర చికిత్స చేయించుకున్న నాయక్ తనను మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లోకి మార్చమని ఉన్నతాధికారులకు విన్నవించగా వారు సమ్మతించారు. అయితే సెక్షన్ అఫీసర్ అంగీకరించకపోవడంతో పలుమార్లు తెలుగునాడు విద్యుత్ కార్మిక ఉద్యోగ సంఘ నేతలకు సైతం విన్నవించారు. అయినా ఫలితం లేకపోవడంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. నరసరావుపేటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో విషమ పరిస్థితుల్లో వైద్య చికిత్సను పొందుతున్నాడు.

ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి దృష్టికి... సేవా నాయక్ గడ్డి మందు తాగిన విషయాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. దీంతో తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ఏపీజెన్‌కో ఎండీ చక్రధరబాబు(ఐఏఎస్)తో మాట్లాడతానని హామీనిచ్చారు. అలాగే సేవానాయక్ ఆరోగ్య పరిస్థితి, వైద్య చికిత్సలు గురించి అడిగి తెలుసుకున్నారు.



న్యాయ దేవత విగ్రహానికి పూలమాలలు వేసిన న్యాయవాదులు

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు

సత్తెనపల్లి, జూన్ 14 : గత ప్రభుత్వ హయాంలో జగన్‌రెడ్డి తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రద్దు చేసినందుకు టీడీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు మద్దినేని వెంకట చలపతిరావు, న్యాయవాదులు ధన్యవాదాలు తెలిపారు. ముందుగా న్యాయ దేవత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికలముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఐదు సంతకాల్లో భాగంగా అమలుచేయటం ఎంతో అభినందనీయం అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు కూడా సుదీర్ఘ కాలం పోరాటం చేశారన్న విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో అనుమోలు జయరామ్, పూజల వెంకట కోటయ్య, కల్లం వీరభాస్కర్‌రెడ్డి, దివ్వెల శ్రీను, పూదోట రాజు, జానీ ఖాజావలి, కొల్లా వెంకటేశ్వరరావు, బొక్కా సంగీతరావు, పాటిబండ్ల రవి, మదన్ మోహన్ తదితర న్యాయవాదులు, న్యాయవాది గుమస్తాలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు

22న రాత పరీక్ష

క్రోసూరు, జూన్ 14 : క్రోసూరులోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశం కోసం ఈనెల 22న రాత పరీక్ష నిర్వహించనున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ మేరి సూజన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి 21వ తేదీవరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ప్రవేశ పరీక్ష 22న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల మధ్య ఉంటుందన్నారు. 7వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఏ క్లాసులో చేరాలనుకుంటే దానికి ముందు తరగతికి సంబంధించిన ఒక్కో సబ్జక్టుల్లో (హిందీ తప్పా) 20 మార్కులు చొప్పున ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఖాళీలను మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో భర్తీ చేయటం జరుగుతుందన్నారు. వివరాలకు మోడల్ స్కూల్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

నమ్మకాన్ని నిలబెట్టిన ఐదు సంతకాలు..

● ప్రజల్లో చంద్రబాబు నాయకత్వంపై మరింత నమ్మకం

పిడుగురాళ్ల, జూన్ 14: అధికారంలోకి రాగానే మొదటి ఐదు హామీలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన సంతకాలు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాయి. ఐదేళ్ల వైసీపీ అరాచకపాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్‌రెడ్డి పాలనతో విసుగు చెందిన ప్రజలు చంద్రబాబునాయుడుపై విశ్వాసంతో కూటమికి భారీ మెజార్టీతో అధికారాన్ని కట్ట బెట్టారు. అందుకనుగుణంగానే చంద్రబాబు అడుగులు వేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తూ వాడవాడలా అభినందనల జల్లు కురిపిస్తున్నారు. ఐదేళ్లుగా మూత పడిన అన్నా క్యాంటీన్‌ల పునరుద్ధరణ, నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ, పింఛన్ రూ.4 వేలు పెంపుతో ప్రజల్లో చంద్రబాబు నాయకత్వం పై మరింత విశ్వాసాన్ని పెంచేలా చేసింది.



పిడుగురాళ్ల పట్టణంలోని అన్నక్యాంటీన్

వేలాది మంది ఆటో డ్రైవర్ల కడుపునింపుతోంది
- దూదేకుల బుజ్జి, పిడుగురాళ్ల



పిడుగురాళ్ల పట్టణంలో వేలాది మంది ఆటోడ్రైవర్లు గత ఐదేళ్లుగా ఉసూరుమంటూ హోటల్ భోజనం, తోపుడు బండ్లపై ఆధారపడి టైమ్‌కు ఏదుంటే అది తిని ఆరోగ్యం చెడగొట్టుకున్నాం. ఇప్పుడు మరలా అన్నా క్యాంటీన్ పునరుద్ధరణపై చంద్రబాబు సంతకం చేయడం వేలాది మంది ఆటో డ్రైవర్ల కడుపునింపుతుంది. ఇది ఎంతో సంతోషదాయకం.

నిరుద్యోగ యువతకు మెగాడిఎస్సీ ఆశాదీపం
- ఆవుల జనార్ధనరావు, పిడుగురాళ్ల



రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువతకు చంద్రబాబు ప్రకటించిన మెగా డీఎస్సీ చీకట్లో దివిటీలా కనిపిస్తుంది. టెట్ ఉత్తీర్ణత సాధించిన లక్షలాది మంది వలంటీర్లు, చిరుద్యోగులుగా జీవితాలను ఎంచుకొని ఎంతో నలిగిపోయి ఉన్నారు. అర్హతకు తగిన ఉద్యోగాన్ని కల్పించేందుకు చంద్రబాబు ఇచ్చిన మెగా డీఎస్సీ ప్రకటన నిరుద్యోగులకు ఆశాదీపంలా కనిపిస్తుంది.

చంద్రబాబును పెద్దకొడుకులా చూస్తాం
- ఆవుల బాలమ్మ, చిన అగ్రహారం



గత 30 ఏళ్ల క్రితం నాకు 75 రూపాయల పింఛన్ ఇచ్చారు. ఆ తర్వాత ఎన్టీ రామారావు, చంద్రబాబు హయాంలో 2 వేల రూపాయల వరకు పెరిగింది. ఇప్పుడు వచ్చే నెల నుండి రూ.4 వేల రూపాయలు పింఛన్ అందిస్తామని సంతకం చేసిన చంద్రబాబు రాష్ట్రంలో ఎంతో మంది వృద్ధులు, వికలాంగుల కుటుంబాలకు పెద్ద కొడుకు అయ్యాడు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు కోట్లాది మందికి మేలు
- ఆలేటి మల్లికార్జునరావు, పిడుగురాళ్ల



వైసీపీ ప్రభుత్వం అమలులోకి తెచ్చేందుకు ప్రయత్నించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే ఆ యాక్ట్ రద్దుపై సంతకం చేసి రాష్ట్రంలో కోట్లాది మంది భూములు, ఆస్తులు కలిగిన వారికి ఎంతో మేలు చేకూర్చిన నేతగా ప్రసంశలు అందుకుంటున్నాడు. మన ఆస్తికి మనమే యజమానులమని చెప్పేందుకు గత సీఎం జగన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చట్టంగా రూపుదాల్చి వివాదాస్పదమైంది. దానిని తిరస్కరిస్తూ న్యాయవాదులు సైతం నిరసన గళమెత్తారు. వైసీపీ ఓటమికి ఆ చట్టమే కీలకమని చెప్పవచ్చు

పాదయాత్రలు .. క్షీరాభిషేకాలు

మాచవరం, జూన్ 14: గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గెలుపును పురస్కరించుకొని సాగర్‌లోని మేరీమాత దేవాలయానికి ఇద్దరు యువకులు పాదయాత్ర ప్రారంభించారు. మండలంలోని వేమవరం ఎస్సీ కాలనీకిచెందిన గల్లా కరుణాకరరావు, బానిపొంగు రమేష్‌లు యరపతినేని శ్రీనివాసరావు గెలిస్తే గురజాల నుండి సాగర్ మాత దేవాలయానికి వేమవరం గ్రామం నుండి పాదయాత్రగా వస్తామని మొక్కుకున్నారు. ఆ మొక్కు తీర్చుకునేందుకు గాను శుక్రవారం సాయంత్రం మేరిమాత దేవాలయానికి వారు పాదయాత్ర ప్రారంభించారు. వీరి పాదయాత్రకు స్థానిక టీడీపీ నాయకులు ఏసుపొంగు ఆనందరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు గుడె లక్ష్మీనారాయణ, గల్లా ఆదాం, బానిపొంగు ప్రసాద్, లాజరు, కోటయ్య, టీడీపీ శ్రేణులు సంఘీభావం తెలిపారు.

నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం ..

రాష్ట్ర మంత్రివర్గంలో టీజీ భరత్‌కు చోటు కల్పించడంతో స్థానిక ఆర్యవైశ్య సంఘ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, రాష్ట్ర మంత్రివర్యులు టీజీ భరత్ చిత్రపటాలకు శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇద్దరు ఆర్యవైశ్యులకు ఎమ్మెల్యే సీట్లు ఇవ్వగా, వారిద్దతూ భారీజరిగిందని, ఇద్దరు గెలవడంతో టిజి భరత్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించడం పట్ల చంద్రబాబునాయుడుకు ఆర్యవైశ్య సంఘ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెకె చిల్లీస్ అధినేత చిట్టిప్రోలు నరసింహారావు, లఘువరపు వెంకటేశ్వర్లు, స్థానిక ఆర్యవైశ్య సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాచవరంలో చంద్రబాబు, యరపతినేని, టీజీ భరత్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



అమరావతిలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వృద్ధులు

గురజాలటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన క్యాబినేట్‌లో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన టిజి భరత్‌కు చోటు కల్పించడం హర్షణీయమని టీడీపీ వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు సముచితస్థానం టీడీపీతోనే సాధ్యమని చిన్ని శ్రీనివాసరావు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మొక్కులు చెల్లించుకున్న మహిళలు..

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అఖండ మెజార్టీతో గెలుపొందడంతో మండలంలోని విజయపురిసౌత్‌లోని సాగరమాత ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంలోని పాతూరుకు చెందిన మహిళలు కాలినడకన ర్యాలీగా సాగరమాత ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ర్యాలీని టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి, బండ్ల శ్రీనివాసరావులు, లెనిన్‌బాబులు ప్రారంభించారు.

అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు చేసిన ఐదు సంతకాలలో ఒకటైన పెన్షన్‌ల పెంపునకు సంబంధించి తీసుకున్న నిర్ణయానికి వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. శుక్రవారం అమరావతిలోని పట్నం ఎస్సీకాలనీలో వృద్ధులు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెరుకూరి బాబు, శ్రీలం నరసింహారావు, అనిల్, సుధాకర్, ఖాన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అనితకు హోం శాఖ కేటాయింపుపై

టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల హర్షం

క్రోసూరు, జూన్ 14 : రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు , మంత్రి వంగలపూడి అనితకు హోం శాఖ కేటాయించటంపై జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దుద్దుల యోహాన్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాదిగ వర్గానికి మంత్రి వర్గంలో రెండవస్థానంగా ఉన్న హోంశాఖను కేటాయించటం ఎస్సీ వర్గాలపై చంద్రబాబుకి వున్న ప్రేమాభిమానాలకు నిదర్శనం అన్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో వంగలపూడి అనిత వైసీపీ మంత్రుల, ఎమ్మెల్యేల నోటి దురుసు తనానికి ఎన్నో అవమానాలకు గురైందన్నారు. అయినా ఆత్మవిశ్వాసంతో పార్టీ క్రమశిక్షనతో నిలబడి నేడు రాష్ట్ర హోంమంత్రి స్థాయికి ఎదిగిందని అన్నారు. హోం శాఖను ఆమె సమర్థవంతంగా నిర్వహించ గలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఎస్సీ సెల్ నాయకులు కిషోర్, కృష్ణారావు, శ్రీనివాసరావు తదితరులు హోంమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

చెరుకుంపాలెం సర్పంచ్ రాజీనామా

అచ్చంపేట, జూన్ 14 : మండలంలోని చెరుకుంపాలెం గ్రామ సర్పంచ్ చింతగుంట్ల అనురాధ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను జిల్లా గ్రామపంచాయతీ అధికారి ఎంవీ భాస్కర్‌రెడ్డికి అందించారు. వైసీపీకి చెందిన సర్పంచ్ అనురాధ రాజీనామా చేయటంతో గ్రామ ఉప సర్పంచ్ పోట్ల శ్రీనివాసరావుకు సర్పంచ్ బాధ్యతలను రెండు మూడు రోజుల్లో అప్పగించే అవకాశం ఉంది. వ్యక్తిగత కారణాలతో తాను రాజీనామా చేస్తున్నట్టు అనురాధ పంచాయతీ అధికారికి ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు.

17న వేంకటేశ్వరస్వామి శాంతికల్యాణం

మాచర్ల రూరల్, జూన్ 14: పట్టణంలోని పాత వడ్డెరపాలెంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీసమేత వేంకటేశ్వరస్వామి, గోదాదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 17న స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనునట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్యాణం అనంతరం అన్నదానం ఉంటుందన్నారు. 18వ తేదీ శేషవాహనంపై స్వామివారి ఊరేగించనున్నారు.

బీసీ బాలుర హాస్టల్ వార్డెన్‌గా సుశీల

రెంటచింతల,జూన్ 14 : మండల కేంద్రమైన రెంటచింతలలోని బీసీ బాలుర హాస్టల్ వార్డన్‌గా కే.సుశీల శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు గంగాధర్ ఇన్‌చార్జి వార్డెన్‌గా వ్యవహరించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి సంక్షేమానికి కృషి చేస్తానని వార్డన్ సుశీల ఈ సందర్భంగా తెలిపారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

నకరికల్లు, జూన్ 14 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగ్స్, షూస్, యూనిఫాం, బెల్టు, నోట్ బుక్స్‌తో కూటిన కిట్‌లను అందజేస్తున్నట్టు నరసరావుపేట డివిజన్ ఉప విద్యా శాఖ అధికారి వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన నకరికల్లులోని మండల స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల వారీగా వచ్చిన విద్యా సామగ్రిని వెంటనే పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. నకరికల్లు మండలంలో 5,304 మంది విద్యార్థులు ఉన్నట్టు ఎంఈవో 2ఎంఎల్ఎన్ ప్రసాదు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ బత్తిన మల్లికార్జునరావు, సీవో అంజమ్మ పాల్గొన్నారు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ

● ఇద్దరికి గాయాలు

రెంటచింతల,జూన్ 14 : మేజర్ పంచాయతీ రెంటచింతల పరిధిలోని గొట్టిముక్కల మేజర్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. రెంటచింతల నుంచి పిడుగురాళ్ల సమీపంలోని కరాలపాడుకు మోటర్ సైకిల్‌పై వెళ్తున్న సయ్యద్ బాజీ, సూర్యనారాయణాచారిని ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం 108లో గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సయ్యద్ బాజీ పరిస్థితి విషమంగా ఉండటంతో నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

బక్రీదు రోజున జంతు వధ నిషేధం

● పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ కే అంతారావు

నరసరావుపేట లీగల్, జూన్ 14: బక్రీదు పర్వదినం సందర్భంగా (ఈనెల 17న) చట్టాన్ని ఉల్లంఘించి ఎవరైనా జంతువులను వధించినా, అక్రమంగా తరలించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ కే అంతారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ గోవధ, జంతు సంరక్షణ చట్టం 1997, జంతు రవాణా నియమావళి 1978, 2001 స్లాటర్ హౌస్ రూల్స్ అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకొని జంతు సంరక్షణ చట్టాలను పాటించాలన్నారు. అతిక్రమించిన వారిపై పోలీసు, రెవెన్యూ, పశు సంవర్థక శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. జిల్లా నోడల్ అధికారిగా డాక్టర్ ఎన్‌సీహెచ్ నరసింహులను నియమించామన్నారు. ఈ అంశానికి సంబంధించి ఎవరికైనా సమాచారం ఉంటే 9491502474కు తెలియపరచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీ. రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

అచ్చంపేట, జూన్ 14: మండల కేంద్రమైన అచ్చంపేటలోని ఎస్సీ కాలనీలో జక్కులూరి అనూష(26) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అచ్చంపేటకు చెందిన జక్కుల రాఘవతో ఆమెకు వివాహం కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా అనూష ఇంటిలో ఉరివేసుకొని మృతి చెందినట్టు ఆమె భర్త రాఘవతో పాటు బంధువులు తెలిపారు. అయితే అనూష తల్లి యాంపొంగు రాజకుమారి మాత్రం తన కుమార్తెను హత్యచేశారని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నట్టు సీఐ కరిముల్లాషావలి తెలిపారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రాఘవయాదవ్, తదితరులు

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

రాజుపాలెం,జూన్14: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి మండలంలోని అనుపాలెంలో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన 24 గంటలోనే కీలకమైన ఐదు పథకాల ఫైళ్లపై సంతకం చేసిన సందర్భంగా తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవయాదవ్, గంజి శ్రీనివాస్ తదితరులు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాఘవయాదవ్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పథకాల అమలుకి శ్రీకారం చుట్టారన్నారు. మెగా డీఎస్సీతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అంచుల బాల సైదులు, షేక్ జానీ, గుండెల ఆదాం, అలా బ్రహ్మయ్య, గోరంట్ల కోటేశ్వరరావు, అలా రామయ్య, నల్లగొర్ల పూర్ణయ్య, చింకా వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, యాకోబురావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణపై హర్షం

సత్తెనపల్లి, జూన్ 14: పేదలకోసం రూ.5లకే భోజనం అందించేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన, అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరిస్తూ సీఎం చంద్రబాబునాయుడు సంతకం చేయటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్‌లను మూసి వేయటంతో అది నిరుపయోగంగా మారింది. గతంలో అన్నక్యాంటీన్ ఉన్నప్పుడు రోజువారి కూలీలు, పేద కార్మికులే కాకుండా పట్టణాలకు వివిధ పనులపై వచ్చిన వారికి అన్న క్యాంటీన్ ఆకలి తీర్చేది. ఐదేళ్ల వైసీపీపాలనలో అన్నక్యాంటీన్ మూత పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అన్నక్యాంటీన్‌లను ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారు.

నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ ఓ వరం

పిడుగురాళ్ల, జూన్ 14: రాష్ట్రంలోని వేలాది మంది నిరుద్యోగ యువతీ యువకులకు మెగా డీఎస్సీ ఓ వరమని రాష్ట్ర ఎస్‌జీటీఎఫ్ అధ్యక్షుడు చల్లగుండ్ల శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువత కలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలిసంతకం చేశారని, ఈ పరిణామం హర్షించదగినదని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువత మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందనున్నారని తెలిపారు. నూతన ప్రభుత్వానికి ఎస్‌జిటిఎఫ్ సంఘం నేతలు శ్యామ్, సాదినేని శ్రీనివాసరావు, డి. సుబ్బారావు, ఖాశింసైదా తదితరులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

ప్రజా ప్రభుత్వ ఏర్పాటుపై హర్షాతిరేకం

పిడుగురాళ్ల, జూన్ 14: ప్రజా ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారని టీడీపీ కూటమి నేతలుపేర్కొన్నారు. శుక్రవారం పట్టణ పార్టీ కార్యాలయంలో ఉమ్మడి నేతల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే ఐదు పథకాల అమలుపై సంతకాలు చేయడం ప్రజల్లో సుపరిపాలన ఆశాలు చిగురించాయన్నారు. పట్టణ ఆర్యవైశ్య నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. కార్యక్రమాలలో కనిగిరి శ్రీను, పాండురంగ శ్రీను, షేక్ బాబావలి, వనజా సాంబశివరావు, మద్దాళి సుబ్బయ్య, పల్బూరి ధనుంజయ, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పణితి రవి, వడ్డవల్లి సాంబశివరావు, కోట హరి, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశిం, వెంకటేశ్వర్లు, రామచంద్రరావు, శ్రీను, రామకృష్ణ, కోపూరి ప్రశాంత్, తిరుమలరావు, శివ, ఎల్‌వీఆర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో దోమల నివారణ మందు పిచికారి

క్రోసూరు, జూన్ 14 : క్రోసూరు మండలంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దోమల నివారణ మందును స్ప్రే చేయించారు. తరగతి గదులు, డైనింగ్ హాల్, బెడ్ రూమ్‌లలోను చల్లించినట్టు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని, హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి షేక్ బేగ్ తెలియ జేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్స్ బండి రత్తయ్య, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మేరీ సూజన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ

సత్తెనపల్లి, జూన్ 14 : సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో వైద్యులు, సిబ్బందికి ఇస్తున్న శిక్షణ కొనసాగుతోంది. క్యాన్సర్ స్కానింగ్ శిక్షణలో భాగంగా శుక్రవారం వివిధ వైద్యశాలల నుంచి వచ్చిన డాక్టర్లు, ఏఎన్ఎంలు, హెచ్‌వీలకు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు, ఏరియా వైద్యశాల గైనకాలజిస్టు డాక్టర్ ట్రైనర్ సుజాత వివిధ అంశాల పై శిక్షణ ఇచ్చి స్క్రీనింగ్ ఎలా చేయాలో నేర్పారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రతి లోగిళ్లలో కొత్త సంతోషాలు: ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, జూన్ 14: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపడుతూనే చేసిన ఐదు సంతకాలతో రాష్ట్రంలో ప్రతి ఇంట్లో కొత్త సంతోషాలు విరబూశాయని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలు ముందు, తర్వాత కూడా వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలకు ఐదు సంతకాలతో చంద్రబాబు నాయుడు చెంప పెట్టులాంటి సమాధానం చెప్పినట్లైందన్నారు. ఆర్థికంగా పరిపాలనపరంగా ఎన్నో ఇబ్బందులు, ఎన్నో సవాళ్లున్నా ఇచ్చిన మాట ప్రకారం మొదటిరోజు అలాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడం చంద్రబాబు నాయుడు కే సాధ్యమన్నారు. ఐదేళ్ళ క్రితం సైకో అనే జగన్ అధికారం ఇస్తే ప్రజా వేదిక కూల్చివేతతో తన పాలన ప్రారంభించారన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశం చేశారని, ఇప్పుడు చంద్రబాబు సంక్షేమ సంతకాలతో నవశకానికి నాంది పలికారన్నారు. ఒక అరాచకవాదికి, దార్శనికుడిగా మధ్య తేడా ఆదే అన్నారు. ఇకపై రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు తెరుచుకోనున్నాయని, కేవలం 5 రూపాయలకే నిరుపేదల ఆకలి తీరుతుందని చెప్పారు. ఈ సంక్షేమం, ఉపాధికి ఊతమిచ్చిన సంతకాల అనంతరం ప్రభుత్వం దృష్టి పెట్టాల్సింది గడిచిన అయిదేళ్ల అవినీతి, అక్రమాలపై అన్నారు. తెలుగుదేశం పార్టీ విపక్షంలో ఉన్నప్పుడు విడుదల చేసిన చార్జిషీట్ ప్రకారమే ముఖ్యమంత్రి జగన్అండ్ గ్యాంగ్ అయిదేళ్ల వైసీపీ పాలనలో 8లక్షల కోట్లు ప్రజాధనం లూటీ చేశారని, అందులో ప్రతి పైసా ఇప్పుడు కక్కించాల్సిన అవసరం ఉందన్నారు.

గత ప్రభుత్వంలో శాఖకు ఫోన్ కూడా ఇవ్వలేదు

● ఐసీడీఎస్ పాజెక్టు పీడీ ఉమారాణి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పాజెక్టు పీడీ ఉమారాణి

వినుకొండ టౌన్, జూన్ 14: గత ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాలను విభజించి, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఏర్పాటు చేశారేకాని, కనీసం డిపార్టుమెంట్ ఫోన్ కూడా ఇవ్వలేదని ప్రాజెక్టు పీడీ ఉమారాణి ఆవేదన వ్యక్తంచేశారు. వినుకొండలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు మెరుగైన సేవలు అందించాలని కోరారు. నూతన విద్యా సంవత్సరంలో మొత్తం 825మంది అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పిల్లలు పాఠశాలల్లో చేరనున్నారని తెలిపారు. గతంలో పల్నాడు జిల్లాలో శిశుగృహ, చిల్డ్రన్స్ హోమ్‌లు అద్దె భవనంలో కొనసాగుతున్నాయని, చిల్డ్రన్స్‌హోమ్‌లో 30మంది ఉన్నారని త్వరలో వాటిని తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ సొంత, అద్దె భవనాలను గూర్చి సమాచారం విలేకరులు అడగగా పూర్తి సమాచారం లేదని తెలిపారు. ఆమెతో పాటు సీడీపీవో అనురాధ ఉన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడతో ఐలు ప్రతినిధులు

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుపై న్యాయవాదుల హర్షం

నరసరావుపేట లీగల్, జూన్ 14: గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దుచేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతకం చేసిన నేపథ్యంలో స్థానిక ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ప్రతినిధులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం సీనియర్ న్యాయవాది, ఐలు ప్రతినిధి కొండా సాంబశివరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు బీరాన్ సలీం, దాసరి ఉదయశ్రీ, ఎం.చంద్రశేఖర్, ఎం.హరీష్ కుమార్, ఎం సుబ్బారావులు శాసన సభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబును కలసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ తరగని పోరాట స్ఫూర్తితో చట్టాన్ని రద్దుచేసే వరకు న్యాయవాదులు చేసిన కృషి అభినందనీయమన్నారు.

బక్రీదు రోజున జంతువధ నిషేధం

● పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కే అంతారావు

నరసరావుపేట లీగల్, జూన్ 14: ఈ నెల 17న బక్రీదు పర్వదినం సందర్భంగా చట్టాన్ని ఉల్లంఘించి ఎవరైనా జంతువులను వధించినా, అక్రమంగా తరలించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కే అంతారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ గోవధ, జంతు సంరక్షణ చట్టం 1997, జంతు రవాణా నియమావళి 1978, 2001 స్లాటర్ హౌస్ రూల్స్ అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకొని జంతు సంరక్షణ చట్టాలను పాటించాలన్నారు. అతిక్రమించిన వారిపై పోలీసు, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. జిల్లా నోడల్ అధికారిగా డాక్టర్ ఎన్‌సీహెచ్ నరసింహులను నియమించామన్నారు. ఈ అంశానికి సంబంధించి ఎవరికైనా సమాచారం ఉంటే 9491502474కు తెలియపరచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీ రామారావు తదితరులు పాల్గొన్నారు.



రామిరెడ్డిపాలెంలో ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి జగన్ నరసింహారెడ్డి, వైద్య సిబ్బంది

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు వహించాలి

● వైద్యాధికారి జగన్‌నరసింహారెడ్డి

రొంపిచర్ల, జూన్ 14: దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలని వైద్యాధికారి జగన్‌నరసింహారెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని రామిరెడ్డిపాలెంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలన్నారు. జ్వరం వచ్చినప్పుడు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ పరీక్షల్లో వైష్ణవికి ప్రథమ ర్యాంక్



విద్యార్థిని త్రిలోక్య వైష్ణవి, చరణ్‌ను అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

వినుకొండ టౌన్, జూన్ 15: ఇటీవల చీకటీగలపాలెం మోడల్ పాఠశాల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్షల్లో పెద్దకంచర్ల పాఠశాలకు చెందిన (మెయిన్) సనిశెట్టి త్రిలోక్య వైష్ణవి 80 మార్కులతో ప్రథమ ర్యాంక్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయని పి.శివకుమారి శుక్రవారం తెలిపారు. అదేవిధంగా మరో విద్యార్థి సీహెచ్ చరణ్ అర్హత సాధించి, సీట్లు సాధించినట్లు ఆమె తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు అభినందించి, వారి తల్లిదండ్రులను కొనియాడారు.

పింఛను పెంచి అందరి జీవితాలలో వెలుగులు నింపారు

● మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి

నరసరావుపేట టౌన్, జూన్ 14: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో ముఖ్యమైన పింఛనును పెంచి దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళ, వృద్ధుల జీవితాలలో వెలుగులు నింపారని మైనారిటీ హక్కుల సమితి రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వితంతు, ఒంటరి, వృద్ధులకు రూ.4వేలు పెంచారన్నారు. పింఛన్‌లు పెంచి వారి జీవితాలలో వెలుగులునింపిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

స్టేడియంను దగ్గరుండి బాగుచేయించుకుందాం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



స్విమింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవడ అరవిందబాబు, తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 14: వైసీపీ ప్రభుత్వం గత ఐదు ఏళ్ళుగా నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంను పాడుపెట్టిందని, స్టేడియంను దగ్గరుండి బాగు చేయించుకోవడం మన కర్తవ్యం అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్టేడియంను ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు సందర్శించారు. వాకింగ్ ట్రాక్, ఇండోర్ స్టేడియం, మరుగుదొడ్లు, స్టేడియంలోని స్విమింగ్ పూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ స్టేడియం డాక్టర్ కోడెల శివప్రసాదరావు మానసపుత్రిక అన్నారు. స్టేడియంలో వాకింగ్ ట్రాక్, జిమ్, క్రికెట్ స్టేడియం, వాలీబాల్ కోర్టు, స్విమింగ్ పూల్ ఉన్నాయన్నారు. స్విమింగ్ పూల్ ఐదు సంవత్సరాల నుంచి పాడుపడిపోయిందన్నారు. ఇంత మంచి స్టేడియాన్ని బాగుచేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఉన్న సమయంలో ఏవిధంగా ఉందో అదే విధంగా తప్పనిసరిగా బాగుచేయిస్తామన్నారు. అందరూ నడిచేందుకు వీలుగా వాకింగ్ ట్రాక్‌కు అన్ని సదుపాయాలు దగ్గరుండి చేయిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రతి వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, ప్రతి వ్యవస్థను బాగుచేసుకోవాల్సిన పరిస్థితి కల్పించిందన్నారు. నేడు స్టేడియం, ఇరిగేషన్‌లో కాలువలు అన్నీ బాగుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీటన్నింటిని సరిచేసుకునేందుకు ఆరు నెలల నుంచి ఏడాది సమయం పడుతుందన్నారు. వీటన్నింటికి బడ్జెట్ కావాల్సిఉందని, తప్పనిసరిగా ఏదోవిధంగా బడ్జెట్ కేటాయించుకొని లేదా, విరాళాలు సేకరించి అయినా స్టేడియం బాగుచేయిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ దగ్గరుండి శ్రద్ధతో బాగుచేయించాలని కోరారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మున్సిపల్ అధికారులు, టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ అభిమానులు, కార్యకర్తలు

డాక్టర్ కోడెల స్మృతివనం ఏర్పాటు చేయాలి

నరసరావుపేట టౌన్, జూన్ 14: పల్నాడు ప్రాంతంలో టీడీపీ ఉన్నతికి, ప్రాంత అభివృద్ధికి ఎన్నోసేవలు అందించిన తొలి శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్మృతి వనం నరసరావుపేట పట్టణంలో ఏర్పాటుచేయాలని టీడీపీ అభిమానులు డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ కోడెల శివప్రసాదరావు జ్ఞాపకార్థం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, మల్లమ్మ సెంటర్, స్టేడియం, మున్సిపల్ కార్యాలయం, పల్నాడు రోడ్డు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, రాజాగారికోట, 60 అడుగుల రోడ్డు, వల్లపచెరువు తదితర ప్రాంతాలలో విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు చేతిలో పురుడుపోసుకున్న జేఎన్‌టీయూ కళాశాల, జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పేరుపెట్టి భావితరాల వారికి జ్ఞాపకంగా ఉండేలా తగుచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మందాడి రవి, మాజీ కౌన్సిలర్లు కదం నాగజ్యోతి, గట్టు సత్యనారాయణ, కొండ్రుగుంట లక్ష్మి, షేక్ మస్తాన్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఏ చిన్న సమస్య ఉన్నా నా దృష్టికి తెండి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీరావు లత్కర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కపలవాయి విజయకుమార్ తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 14 :నియోజకవర్గ ప్రజలు ఏ చిన్న సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, నియోజకవర్గంలో పేరుకున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు యత్నిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం పల్నాడు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీరావు లత్కర్‌ను కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తోడుగా నిలవాలని కోరారు. గత ఐదేళ్లు ప్రజా ప్రతినిధులుగా ఉన్నవారు సమస్యల్ని గాలికి వదిలేశారన్నారు. కార్యక్రమంలో కపలవాయి విజయకుమార్, పులుకూరి జగ్గయ్య, ఇమ్మిడిశెట్టి కాశయ్య, గాడిపర్తి సురేష్, చిన్నపరెడ్డి, తల్లపనేని భుజంగరావు, గూడూరు శేఖర్, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాత సురేష్‌కు ఘన సన్మానం



గుంటూరు మెడికల్ కాలేజిలో సురేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

వినుకొండ, జూన్ 14: ప్రపంచ రక్తదాన దినోత్సం సందర్భంగా గుంటూరు మెడికల్ కాలేజిలో శుక్రవారం జరిగిన రక్తదాన శిబిరంలో 83సార్లు రక్తం ఇచ్చిన, రాష్ట్ర అవార్డుగ్రహీత, బెస్టు సోషల్ యాక్టివ్ వర్కర్, సామాజిక కార్యకర్త టీడీపీ సీనియర్ నాయకుడు పీవీ సురేష్‌బాబును కాలేజి రక్తదాన కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు. పీవీ సురేష్ అందరికీ పస్ఫూర్తి అని కొనియాడారు.



న్యాయవాదులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై న్యాయవాదుల హర్షం

వినుకొండ, జూన్ 14: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసిన సందర్భంగా వినుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.వి నాయుడు ఆధ్వర్యంలో బార్ అసోసోయేషన్ కార్యాలయంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేనపార్టీ నాయకులు కొంజేటి నాగశ్రీను రాయల్, నిశంకర శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ న్యాయవాదులు దూరదృష్టితో ప్రజలకు జరగబోయే నష్టాన్ని నివారించేందుకు ఉద్యమం చేశారని వారికి అభినందనాలు తెలిపారు. అనంతరం పవన్ కల్యాణ్, నారా చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గాలి నాగరాజు, గౌస్ మొహిద్దీన్, ఎ.శ్రీనివాసరావు, రామబ్రహ్మం, సీనియర్ న్యాయవాదులు రామకోటేశ్వరరావు, హనుమంతరావు, ఎలవర్తి శ్రీనివాసరావు, ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, సిద్దయ్య, తిరుపతిరావు, బి.శ్రీనివాసరావు, యనమదల శ్రీనివాసరావు, మీసాల శ్రీనివాసరావు, తలారి ఆంజినేయులు, సీతారామాంజినేయులు, శివశంకర్ బాబు, నక్క రమణరావు, అస్మతుల్లాఖాన్, దూళ్ళ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



వేల్పూరులో విద్యాసామగ్రి కిట్లు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ హైమావతి

విద్యాసామగ్రి కిట్ల పంపిణీ

వేల్పూరు (శావల్యాపురం) జూన్ 14: ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న విద్యాకానుక కిట్లును సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ పారా హైమావతి అన్నారు. మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాలలో ప్రభుత్వం అందించిన విద్యాసామగ్రి కిట్లును జడ్పీటీసీ శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మహబూబ్ సుభానీ, టీడీపీ నాయకులు బొల్లా పేరయ్య, దొడ్డా ఏడుకొండలు, పారా చౌదరి, పీడీ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాకు ఆధార్ నమోదు చేసుకోవాలి

● పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు

నరసరావుపేట టౌన్, జూన్ 14: జిల్లాలో 2019, 2020, 2021, 2022 సంవత్సరాలలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికెన విద్యార్థి ఆధార్‌ను బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేయని కారణంగా స్కాలర్‌షిప్ జమ కాలేదని డీఈవో ఎం వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ కాని వివరాలు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. జాబితాలో ఉన్న ప్రతి విద్యార్థి వెంటనే తన బ్యాంక్ ఖాతాకు ఆధార్ సీడింగ్ చేయించుకొని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నగదు జమ అయ్యేలా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. విద్యా మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ నేరుగా విద్యార్థి ఆధార్ నంబరు కు సీడ్ అయిన బ్యాంక్ ఖాతాలో డీబీటీ విధానంలో స్కాలర్‌షిప్ జమచేస్తారని అన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి: పీడీ ఉమారాణి

వినుకొండ టౌన్, జూన్ 14: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లా అధికారి ఉమారాణి కోరారు. స్థానిక సీడీపీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లందరికీ అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో అనూరాధ, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుపై హర్షాతిరేకాలు

బొందిలిపాలెం (శావల్యాపురం) జూన్ 14: ఎన్నికల హామీలలో భాగంగా సామాజిక ఫింఛన్‌లను ఒక్కసారిగా వెయ్యి రూపాయలు పెంచి చంద్రబాబు పేదకుటుంబాలకు ఎంతో భరోసా కల్పించారని టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు అన్నారు. మండలంలోని బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయ ఆవరణలో ఎన్టీఆర్, చంద్రబాబు చిత్రపటాలకు టీడీపీ నాయకులు ఫించన్‌దారులతో కలసి పాలాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒత్తుల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ యరమాసు అనంతమ్మ, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు వై.కోటేశ్వరరావు, జి.విశ్వనాధం, జి.హనుమంతరావు, చింతా గంగయ్య, పి.వెంకట్రావు, సోమేపల్లి వెంకట్రావు, బోడెపూడి నాగేశ్వరరావు, గోపాళం ఆదిబాబు, గరిమిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచారం

నరసరావుపేట లీగల్, జూన్ 14: వివాహితపై రొంపిచర్ల మండలం, నలగార్లపాడుకు చెందిన కాళంగి శ్యామ్‌బాబు అత్యాచారానికి పాల్పడినట్టు మొదటి పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శ్యామ్‌బాబు తనకు పరిచయం ఉన్న విడాకులు పొందిన ఓ మహిళను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి వివాహితపై ఇటీవల అత్యాచారానికి పాల్పడినట్టు బాధితురాలు ఫిర్యాదులో చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న యువత, విద్యార్థి సంఘం నాయకులు

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

వినుకొండ టౌన్, జూన్ 14: రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి, ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకొని తొలి సంతకం డీఎస్సీపైన చేసిన సందర్భంగా వినుకొండ తెలుగు యువత, విద్యార్థి ఐటీడీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. అనంతరం స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గం టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నర్రా కిషోర్, తెలుగు యువత అధ్యక్షుడు బోడెపూడి శంకర్, తూమాటి కాశి, యువత అధికార ప్రతినిధి జానీ, వీరగంధం ప్రశాంత్, నాగేశ్వరరావు, రవికుమార్, ఖాజా, ఫారూక్, బ్రహ్మానాయుడు, ఇమ్రాన్, మాలిక్ , నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు, జూన్ 14: మండల కేంద్రమైన ఈపూరులో ఎమ్మార్పీఎస్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి, ఎన్‌టీఆర్ విగ్రహానికి శుక్రవారం సాయంత్రం పాలాభిషేకం చేశారు. ఎస్సీ మహిళ వంగలపూడి అనితకు హోంశాఖ మంత్రిగా నియమించటంపై హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు టీడీపీ ప్రభుత్వంలోనే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ముసలయ్య, మాజీ జడ్పీటీసీ కన్నయ్య బాబీ, తదితరులు ఉన్నారు.

శిలాఫలకం ధ్వంసంపై కేసు నమోదు

నూజెండ్ల, జూన్ 14: నూజెండ్ల, మండలంలోని చింతలచెరువు సచివాలయం ప్రారంభోత్సవ శిలాఫలకం నవరత్నాల వివరాల పట్టికను ధ్వంసం చేసిన వారి పై కేసు నమోదు చేసినట్టు ఐనవోలు ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం సమయంలో గ్రామానికి చెందిన చేపలమడుగు మదీన్, బత్తిని కొండయ్య, మల్లెల బాల వెంకటేశ్వర్లు, నక్కా తిరుపతిరావు, మల్లెల శ్రీనివాసరావుపై పంచాయతీ సెక్రటరీ పీ వెంకటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నన్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్యవైశ్య కల్యాణ మండపం ఎన్నికలపై రచ్చ

● రెండు గ్రూపులుగా విడిపోయిన నాయకులు

చిలకలూరిపేట, జూన్ 14: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆర్యవైశ్య కల్యాణ మండపం సంఘం ఎన్నికల విషయం ఆర్యవైశ్య వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘానికి అనేక సంవత్సరాలుగా ఎన్నికలు జరగటం లేదు. జనరల్ బాడీ మీటింగ్‌లు కూడా నిర్వహించటం లేదు. సంఘంలో మొత్తం 820 మంది సభ్యులు ఉన్నారు. ఈ సభ్యులు రాజకీయంగా రెండు గ్రూపులు విడిపోయారు. ఒక గ్రూపు వైసీపీకి, మరొక గ్రూపు టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. పొట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో ఉన్న ప్రస్తుత యాజమాన్యం వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నది. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో వైసీపీ నాయకుల ఎన్నికల ప్రచారానికి అక్కడ అనుమతి ఇచ్చారు. ఒక సందర్భంలో సంఘంలోని టీడీపీ అనుకూల వర్గం వారు తెలుగుదేశం పార్టీ నాయకులు విచ్చేస్తున్న కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరినప్పటికీ ప్రస్తుతం యాజమాన్యం అవకాశం ఇవ్వలేదంటున్నారు. దీంతో వ్యవహారం కౌంటింగ్ అనంతరం రచ్చరచ్చగా తయారైంది. తెలుగుదేశం అనుకూల ఆర్యవైశ్య నాయకులు ఈ మధ్య మండపం వద్దకు చేరుకొని తక్షణం కార్యాలయ తాళాలు తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించాలని, ఎన్నికలు కూడా జరపాలని వారు కోరారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం వారు సంఘం జాయింట్ సెక్రటరీ ఆలపాటి వెంకటరావు ద్వారా కార్యాలయ తాళాలు తెలుగుదేశంకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు చేవూరి కృష్ణమూర్తికి కొందరు సంఘ సభ్యుల సమక్షంలో అందజేసినట్టు సమాచారం. ఆ సమయంలో అక్కడ సంఘానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు కనమర్లపూడి రమేష్, గుర్రం సాంబశివరావు, కొత్త కోటేశ్వరరావు, చిలకల రామలింగేశ్వరరావు, రాచుమల్లు శ్రీనివాస్, ఊటుకూరి చంద్ర, మద్ది రామకృష్ణ తదితరులు ఉన్నారు. త్వరలో జనరల్ బాడీ మీటింగ్‌తో పాటు సంఘం ఎన్నికలను నిర్వహించని పక్షంలో తామే మీటింగ్ పెట్టి ఎన్నికలు నిర్వహిస్తామని తాళాలు అందుకున్న చేవూరి కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. కాగా ఈ మండపం ఆవరణలో మొత్తం మూడు కళ్యాణ మండపాలు ఉన్నాయి. వాటిలో ఆర్యవైశ్య కుటుంబాలకు చెందిన వివాహాలకు మాత్రమే అనుమతిస్తారు. ఏడాదికి సుమారుగా రెండు వందలకు పైగా వివాహాలు ఇక్కడ జరుగుతుంటాయి.

రూ.2లక్షల విలువైన విద్యుత్ తీగెలు చోరీ



విద్యుత్ తీగెలు చోరీకి గురవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న స్తంభాలు

యడ్లపాడు, జూన్ 14: స్థిరాస్తి వెంచర్‌లోని విద్యుత్ స్తంభాలకు అమర్చిన అల్యూమినియం తీగెలు చోరీకి గురయ్యాయి. విద్యుత్ శాఖ ఏఈ సాంబశివరావు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం మైదవోలు గ్రామపరిధిలో పదేళ్ల కిందట సాయినగర్ పేరుతో స్థిరాస్థి వెంచర్‌ను ఏర్పాటుచేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతోపాటు విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేశారు. అయితే వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఎలాంటి నిర్మాణాలు చేయకపోవడంతో ఖాళీగా ఉంది. దీంతో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు వెంచర్‌లోని విద్యుత్ స్తంభాలకు అమర్చిన అల్యూమినియం తీగలను స్తంభాల నుంచి తొలగించి ఎత్తుకెళ్ళారు. వెంచర్‌కు కాపలా ఉండే వ్యక్తి గురువారం ఉదయం తీగెలు చోరీకి గురైనట్టు గమనించి వెంచర్ యజమాని కృష్ణకుమారికి తెలియచేయగా ఆమె విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. విద్యుత్‌శాఖ అధికారులు వెంచర్‌ను పరిశీలించి 320 మీటర్ల పొడవైన తీగెలు చోరీకి గురైనట్టు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందన్నారు. ఈ విషయమై యడ్లపాడు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.

కల్యాణ మండప నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం

నాదెండ్ల, జూన్ 14: నరసరావుపేట మండలంలోని రంగారెడ్డిపాలెంలో నిర్మిస్తున్న కల్యాణ మండప నిర్మాణానికి రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత అందజేశారు. గతంలో రూ.5 లక్షల విరాళాన్ని అందజేయగా శుక్రవారం మరో రూ.5లక్షల విరాళాన్ని కమిటీ సభ్యులకు రామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పీ అప్పిరెడ్డి, వై చంద్రమౌళిరెడ్డి, హనిమిరెడ్డి, రమణారెడ్డి, సాంబిరెడ్డి తదితరులు రామిరెడ్డిని ఘనంగా సత్కరించారు.



నరికి గుట్టలుగా వేసిన చెట్ల కొమ్మలు

ఎన్నెస్పీ కాలువ గట్టుపై చెట్లు కొట్టివేత

● కొత్తలూరులో వైసీపీ నాయకుడి ఆగడాలు

కొత్తలూరు (శావల్యాపురం) జూన్ 14: శావల్యాపురం నుంచి కొత్తలూరుకు వెళ్ళే మార్గంలో ఎన్నెస్పీ మేజరు కాలువ గట్టుపైన దట్టంగా పెరిగిన చెట్లను గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు అక్రమంగా నరికివేయించి ఇతరులకు విక్రయిస్తున్నట్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం ఆరోపించారు. కొత్తలూరులో గ్రామదేవత పోలేరమ్మ దేవాలయానికి చెందిన 9ఎకరాల భూములు ఉన్నాయని, వాటికి ఆనుకొని పోట్లూరు ఎన్నెస్పీ మేజర్ కాలువకట్ట ఉందని, గత ఐదేళ్ళుగా ఎన్నెస్పీ శాఖవారు కాలువ కట్టలపై పెరిగిన చెట్లు కొట్టించక పోవడంతో అవి దట్టంగా పెరిగాయన్నారు. వాటిపై కన్నేసిన వైసీపీ నాయకుడు రెండ్రోజులుగా ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు కూలీలతో దేవాలయ భూములకు ఆనుకొని ఉన్న మేజర్ కాలువకట్టకు బారున పెరిగిన చెట్లను నరికించి ఇతరులకు విక్రయిస్తున్నారని, కొన్నవారు ట్రాక్టర్‌లలో వచ్చి నరికిన చెట్లను ఇతర ప్రాంతాలకు చేరవేసుకొంటున్నారని తెలిపారు. ఎన్నెస్పీ కాలువకట్ట గట్లపై పెరిగిన చెట్లను అధికారుల కన్నుగప్పి ఇలా విక్రయించడంపై స్థానికులు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి చెట్లను విక్రయించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వరి గడ్డి వామి దగ్ధం

నాదెండ్ల, జూన్ 14: మండలంలోని జంగాలపల్లిలో గురువారం రాత్రి వరి గడ్డి వామి దగ్ధమైంది. దగ్ధమైన వరిగడ్డి విలువ సుమారు రూ.50వేలు ఉంటుంది. బాధితుడు మాడగు సాంబయ్య కుటుంబీకులు గడిచిన ఎన్నికల్లో టీడీపీ తరుపున క్రియాశీలకంగా పనిచేశారు. ఈ క్రమంలోనే వైసీపీకి చెందినవారు ఈ వామికి నిప్పుపెట్టి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. చిలకలూరిపేట అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, జూన్ 14: పట్టణంలోని టౌన్ - 2 పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేయటం జరుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు. పురుషోత్తమపట్నం సొలస వారి వీధి, శిల్పశాల ప్రాంతం, పోలిరెడ్డిపాలెం, కోంద్రుపాడు ప్రాంతాలతో పాటు మండలంలోని వేలూరు, తుర్లపాడు, సందెపూడి, కుక్కపల్లివారిపాలెం ప్రాంతాల్లో సరఫరా నిలిపి వేయటం జరుగుతుందని ఆయన తెలిపారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్ళల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలూరిపేట, జూన్ 14: చిలకలూరిపేట మండలం మురికిపూడిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఐదు నుంచి 10వ తరగతి చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులకు ఖాళీలు ఉన్నట్టుగా వార్డెన్ కే రాజబాబు శుక్రవారం తెలిపారు. ఈ హాస్టళ్ళల్లో చేరేందుకై వెంటనే పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్సీలకు 25, ఎస్టీలకు 5, బీసీలకు 9, ఓసీ విద్యార్థులకు 4 ఖాళీలు ఉన్నట్టుగా ఆయన వివరించారు. హాస్టల్‌లో ప్రవేశం కోసం వివరాల కోసం 7416516599 నెంబరుకు సంప్రదించాలని ఆయన కోరారు.